Follow: @ANNTELUGU
28-06-2026
ANN తెలుగు
# మహా పత్రిక
ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 176 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఓట్ల విషయంలో జాగ్రత్త అవసరం

- ఎస్ఐఆర్ ప్రక్రియను గమనించండి
- తొలగించిన ఓట్ల వివరాలు వెను వెంటనే పంపండి
- బీఎల్ఏ-2 సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు సూచనలు

**ఆదిలాబాద్ మహా :** ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా విపక్ష ఓట్ల తొలగింపు తో ప్రజాస్వామ్య మనుగడ కి ముప్పు వాటిల్లనుందని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ , పర్యాటక ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలో ఎస్ఐఆర్ ప్రక్రియ పై బీఎల్ఏ 2లకు నిర్వహించిన అవగాహనా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శ్రేణులకు పలు సూచనలు చేసారు. కాంగ్రెస్ పార్టీకి బలమైన మైనార్టీ , మహిళలు , ఎస్టీ, ఎస్సీల ఓట్ల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. పార్టీ అనుకూల ఓట్లు తొలగించే ప్రక్రియ జరుగుతోందన్నారు. బీఎల్ఏలు పార్టీ మండలాధ్యక్షులు , సూపర్ వైజర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. వారు జాగ్రత్తగా మిగితా 6వ పేజీలో

టాప్ న్యూస్



### నేడు నల్లగొండ 30న ఖమ్మం జిల్లాలకు సీఎం రేవంత్

- 30న ఖమ్మం రైతుమేళా బహిరంగ సభలో పాల్గొననున్న రేవంత్

03



### మీరు గుండెలు బాదుకున్నా ఎస్ఐఆర్ ఆగదు

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- డూప్లికేట్, దొంగ ఓట్ల తొలగింపే లక్ష్యమని స్పష్టం
- ఎస్ఐఆర్‌లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపు

02

### ట్రంపానందం



- హైదరాబాద్ రోడ్డుకు పేరుపై ఎమోషనల్
- థాంక్యూ ఇండియా అంటూ పోస్ట్

03

# జూలైలో.. నయా టీమ్



## కేబినెట్ లో మార్పులపై చర్చలు

- జూలై 8 తర్వాత .. భారీమార్పులకు అవకాశం
- రేవంత్ మార్క్.. దూకుడు టీమ్ రెడీ
- ఏఐసీసీ ఇన్ ఛార్జి, పీసీసీ, స్పీకర్ సహా అనేక కీలకపదవుల్లో మార్పులపై ఊహాగానాలు

(హైదరాబాద్ మహా): పాలనలో ప్రక్షాళన మొదలుపెట్టిన సీఎం.. సీఎస్ తో పాటు సీఎంవోను కూడా సెట్ చేశారు. ఇపుడు సొంత పొలిటికల్ టీమ్ కేబినెట్ ను కూడా జూలైలో ప్రక్షాళన చేయవచ్చని వినబడుతోంది. చాలాకాలంగా వినపడుతున్న విస్తరణ వార్తలు.. జూలైలో నిజమవుతాయని చెబుతున్నారు. పలు రాష్ట్రాల పీసీసీలు, ఇన్ ఛార్జిలను మారుస్తున్న కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ 2028 అసెంబ్లీ ఎన్నికలను పరిగణనలోకి తీసుకుని సీఎం ఆలోచనలకు అనుగుణంగా దూకుడుటీమ్ ను, వేగంగా ఫలితాలు సాధించేటీమ్ ను రెడీ చేస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఇన్ ఛార్జి, పీసీసీతో పాటు స్పీకర్ మార్పు, పలువురు కేబినెట్ మంత్రులకు పార్టీ బాధ్యతలు, పలువురు యువ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు, ఛైర్మన్ మిగతా 2వ పేజీలో



## ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన మంత్రులు

- ఆదిలాబాద్ లో మంత్రులు జూపల్లి, అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఫహీంఖురేషీ పర్యటన
- రూ.20 కోట్లతో నిర్మించిన మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల భవనం ప్రారంభించిన మంత్రులు

02






# జూలైలో.. నయా టీమ్

( మొదటి పేజీ తరువాయి )

పదవులు అన్నీ భర్తీచేయనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే దీనిపై కసరత్తు చేయగా, ఎస్ఐఆర్ అయిపోయేవరకు ఆగుతారా? లేదా జూలై 8 లేదా ఆ తర్వాత భర్తీచేస్తారా? లేదంటే దసరా వరకు సాగదీస్తారా? అన్నది చూడాల్సి ఉంది. జీహెచ్ఎంసీ ఎన్నికలకు సంబంధించి సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో ఆ ఎన్నికలు ముగిసేవరకు చూస్తారా? మరొకరికి ముందే బెర్త్ అప్పగిస్తారా? అన్నది చూడాల్సి ఉన్నది. 35మంది ఛైర్మన్ల పదవీకాలం జూలై 7తో ముగియనుండగా, ఇందులో కొందరికి రెన్యువల్ కావచ్చని, వచ్చే ఎన్నికలను పరిగణనలోకి తీసుకుని ఆయా ఛైర్మన్ పదవుల్లో ఎమ్మెల్యేలను, కీలకనేతలను నియమించే అవకాశం ఉంది. 2028 గెలుపేలక్ష్యంగా నియోజకవర్గాల నుండి రిపోర్ట్ లు తెప్పించుకుంటున్న సీఎం సరైన సమయంలో.. దూకుడుగా పనిచేసే నేతలకు బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. జూలై 22న ఎమ్మెల్యేల ఫిరాయింపులపై హైకోర్టులో వాదనలు ఉన్న నేపథ్యంలో ఆ లోగా స్పీకర్ ను మార్చే అవకాశాలు కూడా ఉన్నాయని వినబడుతోంది. మరి సీఎం వ్యూహాలు ఎలా ఉన్నాయో చూడాల్సి ఉంది.

# డీఎంకే కూటమికి ఎండీఎంకే గుడ్ బై

**విజయ్ కు మద్దతు పలికే అవకాశం**

**చెన్నై, మహా :** తమిళనాట రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం జరిగింది. డీఎంకే నేతృత్వంలోని లౌకిక ప్రగతిశీల కూటమి (సెక్యూలర్ ప్రోగ్రెసివ్ అలియెన్స్) నుంచి వైదొలుగుతున్నట్లు మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కజగం (ఎండీఎంకే) ప్రకటించింది. శనివారం జరిగిన పార్టీ జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు ఒక తీర్మానాన్ని ఆమోదించారు. భవిష్యత్తు పొత్తులపై ఎన్నికల సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటామని పార్టీ వెల్లడించింది. తమిళనాడులో మతతత్వ శక్తులు బలపడకుండా అడ్డుకోవడం, ద్రావిడ ఉద్యమ సూత్రాలను కాపాడడం అనే సిద్ధాంతపరమైన నిబద్ధతతో గత తొమ్మిదేళ్లుగా డీఎంకే కూటమితో కలిసి నడిచామని ఎండీఎంకే పేర్కొంది. అయితే ఇటీవల జరిగిన 2026 అసెంబ్లీ



ఎన్నికల సమయంలో 32 ఏళ్ల రాజకీయ చరిత్ర కలిగిన తమ పార్టీ స్వతంత్ర రాజకీయ గుర్తింపును దెబ్బతీసేందుకు కూటమిలోనే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించింది. అయినప్పటికీ సిద్ధాంతం కోసం ఓపిక పట్టి కూటమిలోనే కొనసాగామని తీర్మానంలో పేర్కొంది.



# ఖచ్చితమైన ఓటరు జాబితాతోనే ప్రజాస్వామ్య బలోపేతం

**మన్నె గోవర్ధన్ రెడ్డి**

**ఖైరతాబాద్, మహా :** ఖైరతాబాద్ నియోజకవర్గంలోని వెంకటేశ్వర డివిజన్ దేవరకొండ బస్తీలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఎన్నికల సంఘం బీఎల్ఓ రేష్మ బేగం, బీఎల్ఏ ఖలీల్ భాయ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఓటరు జాబితాల ప్రత్యేక పరిశీలన ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మన్నె గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు కావాలని స్పష్టం చేశారు. మరణించినవారి పేర్లను తొలగించడం, ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలను సకాలంలో సరిచేయడం వంటి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఓటరు జాబితా అనేది ఎన్నికల ప్రక్రియకు అసలైన పునాది అని, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఖచ్చితమైన ఓటరు జాబితా ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో ముందే పరిశీలించుకోవాలని, అవసరమైతే కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటరు సవరణ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ పరిశీలన కార్యక్రమంలో సయ్యద్ ఫయాజ్, ఎండీ ఫయాజ్ తాహెర్ మరియు దేవరకొండ బస్తీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్‌కు పరిమితి

**హైదరాబాద్, మహా:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అనవసర ఖర్చులను తగ్గించి లబ్ధిదారులపై ఆర్థిక భారం పడకుండా చూడాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ఇకపై ఇంటి స్లాబ్ విస్తీర్ణం నిర్ణీత పరిమితిని మించకూడదని గృహ నిర్మాణ శాఖ స్పష్టం చేసింది. ఈ నిబంధనలు కొత్తగా నిర్మించే ఇళ్లతో పాటు ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఇళ్లకూ వర్తిస్తాయని వెల్లడించింది.గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఇంటి గోడల వెలుపల ముందు భాగంలో గరిష్ఠంగా మూడు అడుగులు, మిగతా మూడు వైపులా ఒక్కో అడుగు మాత్రమే స్లాబ్ పొడిగింపుకు అనుమతి ఉంటుంది. ఆరు వందల చదరపు అడుగుల ఇంటికి గరిష్ఠంగా 750 చదరపు అడుగుల వరకు మాత్రమే స్లాబ్ నిర్మించాలని ఆదేశించారు. ప్రభుత్వం ఒక్కో ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నప్పటికీ, అవసరానికి మించి భారీ స్లాబ్‌లు నిర్మించడం వల్ల సిమెంట్, ఇనుము, కాంక్రీట్, షట్టరింగ్ ఖర్చులు పెరిగి లబ్ధిదారులు అప్పుల పాలవుతున్నట్లు హౌసింగ్ కార్పొరేషన్ అధ్యయనంలో తేలింది. కొందరు నిర్మాణాలను మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితి కూడా ఏర్పడిందని అధికారులు గుర్తించారు. ఇంటి లోపలికి ఎండ, వర్షం రాకుండా ఉండేందుకు భారీ స్లాబ్‌లకు బదులుగా సన్‌షేడ్‌లు, సజ్జలు లేదా ఇతర రక్షణ ఏర్పాట్లు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. కొత్త నిబంధనలపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసింది.రాష్ట్రంలో ఇప్పటికే లక్షకు పైగా ఇందిరమ్మ ఇళ్లు పూర్తికాగా, మరో లక్ష ఇళ్లను సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రెండో విడత ఇళ్ల కేటాయింపుకు ముందే వ్యయ నియంత్రణ, నాణ్యమైన నిర్మాణం లక్ష్యంగా ఈ కొత్త నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చింది.



# ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన మంత్రులు

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ పట్టణంలోని 23వ ,31వ వార్డులలోని తాటిగూడ,అంబేద్కర్ కాలనీలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులు డోమటి లావణ్య, వాంఖడే తానుబాయి - మాధవ్ దంపతులు,అలాగే అస్మా బేగం నూతనంగా నిర్మించుకున్న గృహాలను రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రులు నూతన గృహాలను పరిశీలించి, లబ్ధిదారులను అభినందించారు. వారికి నూతన వస్త్రాలు అందజేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు శాశ్వత నివాస సౌకర్యం కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు .రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాలకు శాశ్వత నివాస సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన సొంత ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రాల హక్కులు హరిస్తే సహించం

**హైదరాబాద్, మహా:** కేంద్రం ప్రతిపాదించిన ఉపాధి హామీ చట్ట సవరణలను తెలంగాణ ప్రభుత్వం అంగీకరించబోదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించేలా చట్టం ఉంటే అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. ఈ అంశంపై కేరళ, కర్ణాటక రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి పోరాటానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.ఉపాధి హామీ చట్ట సవరణలపై శనివారం సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం సమావేశం జరిగింది. కేంద్రం ప్రతిపాదించిన 60 రోజుల ఉపాధి పరిమితికి బదులుగా గ్రామీణ కుటుంబాలకు కనీసం 200 రోజుల ఉపాధి కల్పించాలని సమావేశంలో అభిప్రాయపడినట్లు మంత్రి వెల్లడించారు.కేంద్ర ప్రతిపాదనలపై అనుసరించాల్సిన వ్యూహం, అవసరమైతే రాష్ట్ర సొంత చట్టం తీసుకురావడం, సుప్రీంకోర్టును ఆశ్రయించడం వంటి అంశాలపై జూలై 2న జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# ట్రంపానందం

- హైదరాబాద్ రోడ్డుకు పేరుపై ఎమోషనల్
- థాంక్యూ ఇండియా అంటూ పోస్ట్

**హైదరాబాద్, మహా :** భాగ్యనగరం వేదికగా భారత్‌అమెరికా దౌత్య బంధంలో మరో సరికొత్త మైలురాయి ఆవిష్కృతమైంది. హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ భవనానికి ఆనుకుని ఉన్న ప్రధాన రహదారికి తెలంగాణ ప్రభుత్వం 'డోనాల్డ్ ట్రంప్ ఎవెన్యూ'గా నామకరణం చేయడం అంతర్జాతీయంగా సంచలనం సృష్టించింది. ఈ అరుదైన గౌరవంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ భారత్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి అమెరికన్ ఐటీ దిగ్గజాల కార్యాలయాల చెంతనే ఉన్న ఈ వీధికి తన పేరు పెట్టడం ఒక గొప్ప గౌరవమని, ఈ తరహా గుర్తింపు పొందిన తొలి అమెరికా అధ్యక్షుడిని తానేనని ట్రంప్ హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా ఈ పేరు పెట్టగా, ట్రంప్ స్పందించడంతో వావ్ రేవంత్ జీ అంటూ జాతీయ నాయకులు ప్రశంసిస్తున్నారు.




# ఆఫ్ఘనిస్తాన్‌లో భారీ భూకంపం

- ఢిల్లీ, కశ్మీర్‌లో ప్రకంపనలు.
- హిందూకుష్‌లో 6.2 తీవ్రతతో భూకంపం.
- ఉత్తర భారతంలో భయాందోళనలు.
- ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు.

**ఢిల్లీ, మహా :** ఆఫ్ఘనిస్తాన్‌లోని హిందూకుష్ పర్వత ప్రాంతాన్ని శనివారం సాయంత్రం సంభవించిన భారీ భూకంపం వణికించింది. రిక్టర్ స్కేలుపై 6.2 తీవ్రతతో నమోదైన ఈ భూకంప ప్రభావం ఉత్తర భారతదేశంలోని ఢిల్లీఎన్‌సీఆర్, జమ్మూ కశ్మీర్‌తో పాటు పాకిస్తాన్‌లోని పలు ప్రాంతాల్లోనూ కనిపించింది. ఒక్కసారిగా భూమి కంపించడంతో ప్రజలు భయాందోళనలకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం అందలేదు.

**హిందూకుష్ ప్రాంతంలో భూకంప కేంద్రం**

జాతీయ భూకంప పరిశోధనా కేంద్రం వివరాల ప్రకారం భారత కాలమానం ప్రకారం శనివారం రాత్రి 7 గంటల 4 నిమిషాలకు ఆఫ్ఘనిస్తాన్‌లోని హిందూకుష్ ప్రాంతంలో 6.2 తీవ్రతతో భూకంపం సంభవించింది. భూకంప కేంద్రం భూమికి సుమారు 215 కిలోమీటర్ల లోతులో నమోదైంది. లోతైన ప్రాంతంలో సంభవించినప్పటికీ దీని ప్రకంపనలు విస్తృత ప్రాంతాలకు వ్యాపించాయి.




**ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో భయాందోళనలు**

భూకంప ప్రకంపనలు ఢిల్లీఎన్‌సీఆర్, జమ్మూ కశ్మీర్ ప్రాంతాల్లో స్పష్టంగా అనిపించాయి. కొద్ది సెకన్లపాటు భవనాలు కంపించడంతో ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. సామాజిక మాధ్యమాల్లో కూడా ప్రకంపనల అనుభవాలను పలువురు పంచుకున్నారు. అధికారులు పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

**పలు దేశాలకు విస్తరించిన ప్రభావం**

భూకంప కేంద్రం ఆఫ్ఘనిస్తాన్‌లోని కలాఫ్‌గాన్ ప్రాంతానికి సమీపంలో ఉండగా, పాకిస్తాన్, భారతదేశం, చైనా, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్, కిర్గిజ్‌స్థాన్, తుర్క్‌మెనిస్తాన్ వంటి దేశాల్లోనూ స్వల్ప నుంచి మోస్తరు ప్రకంపనలు నమోదైనట్లు ప్రాథమిక సమాచారం వెల్లడిస్తోంది. హిందూకుష్ ప్రాంతం భూకంపాలకు అత్యంత సున్నితమైన ప్రాంతంగా భూకంప శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

**ప్రాణనష్టం లేదన్న ప్రాథమిక సమాచారం**

భూకంపం తీవ్రత ఎక్కువగానే ఉన్నప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరిగినట్లు అధికారిక సమాచారం వెలువడలేదు. స్థానిక అధికారులు పరిస్థితిని నిశితంగా గమనిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నారు. మరిన్ని వివరాలు అందిన తర్వాత పూర్తి సమాచారం వెల్లడించే అవకాశం ఉంది.

**లోతైన భూకంపాల ప్రభావం**

భూకంప శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం 6.2 తీవ్రతతో సంభవించే భూకంపాలు బలమైనవిగా పరిగణిస్తారు. అయితే భూకంపం ఎంత లోతులో సంభవించింది, జనావాసాలకు ఎంత దూరంలో ఉంది, స్థానిక నిర్మాణాల బలం వంటి అంశాలపై నష్టం ఆధారపడి ఉంటుంది. ఈసారి భూకంపం 215 కిలోమీటర్ల లోతులో సంభవించడంతో విస్తృత ప్రాంతాల్లో ప్రకంపనలు అనిపించినప్పటికీ భారీ విధ్వంసం జరగకుండా ఉండే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# మహిళా రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలి

- ఢిల్లీలో భారీ మహిళా మహాసభ నిర్వహిద్దాం.
- మహిళల శక్తిని దేశానికి చాటుదాం.. కల్వకుంట్ల కవిత పిలుపు.

**హైదరాబాద్,మహా :** చట్టసభల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. పార్లమెంట్ ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లు ఇప్పటికీ అమలులోకి రాకపోవడం దురదృష్టకరమని పేర్కొంటూ, దేశవ్యాప్తంగా మహిళల ఐక్యశక్తిని ప్రదర్శించేలా ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో లక్షలాది మహిళలతో భారీ మహాసభ నిర్వహించాలని పిలుపునిచ్చారు.

హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన మహిళా రిజర్వేషన్ల సాధన సభలో మాట్లాడిన కవిత, మహిళా రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించినప్పటికీ అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని విమర్శించారు. బిల్లును అమలు చేయకుండా వాయిదా వేయడం ద్వారా మహిళల ఆశలను నిరాశపరిచారని అన్నారు. దేశవ్యాప్తంగా మహిళల శక్తిని మరోసారి చాటిచెప్పాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు.

మహిళా రిజర్వేషన్ల అమలుపై కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ మహిళా మహాసభ నిర్వహించాలని కవిత పిలుపునిచ్చారు. అవసరమైతే హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోనూ లక్షలాది మహిళలతో సభ నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మహిళల ఐక్యతే ఈ ఉద్యమానికి బలం కావాలని ఆమె అన్నారు.



రాజకీయాల్లో మహిళలకు నిజమైన సాధికారత రావాలంటే నిర్ణయాత్మక స్థానాల్లో వారికి అవకాశాలు కల్పించాల్సిందేనని కవిత స్పష్టం చేశారు. మహిళలు ఒక స్థాయి వరకు ఎదిగిన తర్వాత వారిని అడ్డుకునే పరిస్థితులు ఇప్పటికీ కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితులను అధిగమించేందుకు చట్టబద్ధమైన రిజర్వేషన్లే శాశ్వత పరిష్కారమని ఆమె అభిప్రాయపడ్డారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం వెనుక దేశవ్యాప్తంగా జరిగిన ఉద్యమాలే ప్రధాన కారణమని కవిత గుర్తుచేశారు. జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించడంతో పాటు వివిధ రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టడం ద్వారా కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చామని చెప్పారు. ఆ ఒత్తిడి ఫలితంగానే బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించిందని, ఇప్పుడు అమలుకోసం మరోసారి పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

దేశ రాజకీయాల్లో మహిళల ఓటు కీలక శక్తిగా మారిందని కవిత పేర్కొన్నారు. మహిళలను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు అనేక సంక్షేమ పథకాలు ప్రకటిస్తున్నప్పటికీ, మహిళా రిజర్వేషన్ అమలు విషయంలో మాత్రం స్పష్టత చూపడం లేదని విమర్శించారు. రిజర్వేషన్ అమలు చేయని పార్టీలకు మహిళలు తమ ఓటుతో గుణపాఠం చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు.

మహిళల కోసం ధైర్యంగా రాజకీయ పార్టీని ప్రారంభించానని, మహిళలందరూ గర్వపడే విధంగా రాజకీయాలు చేస్తానని కవిత హామీ ఇచ్చారు. మహిళా నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. చట్టసభల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లు సాధించే వరకు ఉద్యమం ఆగదని ఆమె స్పష్టం చేశారు.



## కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉండి.. మా మాట ఎవరూ పట్టించుకోవట్లే

- ఆదిలాబాద్, నిర్మల్ లో బిజెపి ఎమ్మెల్యేలదే నడుస్తోంది
- కార్యకర్తలకు ఎలా న్యాయం చేయాలి?
- ఇన్ ఛార్జ్ మంత్రి ముందు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు ఆవేదన

**ఆదిలాబాద్, మహా :** కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉండి, కాంగ్రెస్ ప్రభుత్వం ఉండి.. తమను ఎవరూ పట్టించుకోవడగం లేదని, ముక్కు ముఖం తెలియనివాళ్ళకు పదవులు ఎట్ల వస్తున్నయో అర్థంకాకుండా వస్తున్నాయని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ లో పాయల్ శంకర్ ది నడుస్తంది.. లేదంటే జోగురామన్న ది నడుస్తది. నిర్మల్ లో మహేశ్వరరెడ్డిది నడుస్తంది. డిసిసిలు, ఎమ్మెల్యేలు, ఇన్ ఛార్జిలకు ఏది గౌరవం.. ఒక కార్యకర్తకు అపాయింట్ మెంట్ చేస్తమంటే దిక్కులేదు. మేం ఇస్తే ఎవరూ పట్టించుకోవట్లే. ఇట్లయితే కార్యకర్తలకు ఎలా న్యాయం చేస్తాం. ఎలా పార్టీని ముందుకుతీసుకువెళ్తాం అంటూ బొజ్జు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని పూర్తిగా మార్చాలని విజ్ఞప్తిచేశారు.

## నేడు నల్లగొండ 30న ఖమ్మం జిల్లాలకు సీఎం రేవంత్

**హైదరాబాద్, మహా :** జిల్లాల పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. నల్గొండ జిల్లా కనగల్ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ రోడ్లకు శంకుస్థాపన చేసి పైలాన్ ను ఆవిష్కరించనున్న సీఎం, తర్వాత రూ.83 కోట్లతో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో డ్రింకింగ్ వాటర్ స్కీమ్ ఫేజ్ 1 కు శంఖుస్థాసన చేస్తారు. అనంతరం జరిగే బహిరంగసభలో ప్రసంగిస్తారు. ఖమ్మంలో ఆదివారం నుండి రైతుమేళా ప్రారంభమవుతుండగా, 30న జరిగే బహిరంగసభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. వరుసగా జిల్లాల పర్యటనలతో క్యాడర్ లో జోష్ నింపే యత్నం చేస్తున్నారు.



## మీరు గుండెలు బాదుకున్నా ఎస్ఐఆర్ ఆగదు

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్, మహా :** ఎస్ఐఆర్ అంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ గుండెలు బాదుకుంటున్నాయని మీరు గుండెలు బాదుకున్న ఈ ప్రక్రియ ఆగదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఎస్ఐఆర్ చేశారని కానీ ఇప్పుడు జరుగుతున్న సవరణపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఎస్ఐఆర్ చేసిన రాష్ట్రాల్లో పోలింగ్ శాతం భారీగా పెరిగిందన్నారు. ఎలక్షన్ కమిషన్ రాజ్యాంగ బద్ధమైన స్వతంత్ర కమిషన్ అని అది తన పని తాను చేసుకుంటూ వెళ్తోందన్నారు. డూప్లికేట్ ఓట్లు, దొంగఓట్లను తొలగించేందుకే ఈసీ సర్ ప్రక్రియను చేపట్టినట్లు వివరించారు. ఎలక్షన్ కమిషన్ మీద బురదజల్లే ప్రయత్నం రాహుల్ గాంధీ చేస్తున్నారన్నారు. ఎలక్షన్ కమిషన్ విషయంలో ప్రళయం సృష్టిస్తానని చెప్పిన రాహుల్ గాంధీ ఏ రకంగా నవ్వుల పాలయ్యారో దేశమంతా చూసిందన్నారు. ఓటర్ల జాబితా సవరణ అనేది నిరంతర ప్రక్రియ అని దీన్ని రాజకీయం చేయాలని చూడటం దురదృష్టకరం అన్నారు. ఎస్ఐఆర్ లో ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# మొహర్రం ఊరేగింపుపై విషకుట్ర

- వేలాది ప్రాణాలను కాపాడిన పోలీసులు.
- ముంబైలో తప్పిన భారీ మారణహోమం.
- విష గుళికలతో నిందితుడు ఫయాజ్ అరెస్ట్.
- ఊరేగింపులో విష కాప్సూల్స్ పంపిణీ యత్నం.
- పద్నాలుగు వేల తొమ్మిది వందల విష గుళికలు స్వాధీనం.



**ముంబై, మహా. :** ముంబైలో మొహర్రం ఊరేగింపును లక్ష్యంగా చేసుకుని భారీ ప్రాణనష్టం కలిగించే కుట్రను పోలీసులు భగ్నం చేశారు. ఊరేగింపులో పాల్గొనే వారికి నొప్పి నివారణ మందుల పేరుతో విషపూరిత కాప్సూల్స్ పంపిణీ చేసి మారణహోమం సృష్టించాలని యత్నించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి సుమారు పద్నాలుగు వేల తొమ్మిది వందల విష కాప్సూల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపగా, కుట్ర వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణంలో పోలీసులు విస్తృత దర్యాప్తు చేపట్టారు.

**భారీ ప్రమాదాన్ని అడ్డుకున్న అప్రమత్తత**

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం పుణె నగరంలోని విమాన్ నగర్ ప్రాంతానికి చెందిన ఫయాజ్ ప్రేమ్‌జీ కొద్దిరోజులుగా ముంబైలోని డోంగ్రీ ప్రాంతంలోని ఓ గెస్ట్ హౌస్‌లో ఉంటూ ఈ కుట్రకు ప్రణాళిక రచించినట్లు గుర్తించారు. మొహర్రం ఊరేగింపులో పాల్గొనే ప్రజలకు కాప్సూల్స్ పంపిణీ చేస్తున్న సమయంలో అతని ప్రవర్తనపై అనుమానం వచ్చిన భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై వాటిని పరిశీలించారు. అనంతరం పోలీసులు రంగంలోకి దిగి నిందితుడిని అదుపులోకి తీసుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

**విషపూరిత కాప్సూల్స్ తయారీ**

విచారణలో నిందితుడు ఎలుకల మందుగా ఉపయోగించే జింక్ ఫాస్ఫైడ్ అనే ప్రమాదకర రసాయనాన్ని ఉపయోగించి కాప్సూల్స్ తయారు చేసినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. సుమారు యాభై కిలోల రసాయనంతో వేల సంఖ్యలో కాప్సూల్స్ తయారు చేసి వాటిని ప్రజలకు పంపిణీ చేయాలని యోచించినట్లు వెల్లడించారు. మొత్తం ముప్పై వేల కాప్సూల్స్ తయారు చేయాలనే లక్ష్యంతో ఉన్నప్పటికీ, పోలీసులు మధ్యలోనే అడ్డుకోవడంతో ఆ ప్రణాళిక విఫలమైంది.

**ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన కుట్ర**

తెల్లవారుజామున ఓ వ్యక్తికి కాప్సూల్ తీసుకున్న తర్వాత వాంతులు, కడుపునొప్పి వంటి సమస్యలు తలెత్తడంతో పోలీసులకు సమాచారం అందింది. వెంటనే స్పందించిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కాప్సూల్స్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో ఊరేగింపులో పాల్గొన్న వేలాది మంది ప్రాణాలు ప్రమాదం నుంచి బయటపడ్డాయని అధికారులు తెలిపారు.

**విదేశీ ప్రయాణాలపై అనుమానాలు**

దర్యాప్తులో నిందితుడు గత కొన్నేళ్లుగా ఇరాన్, ఇరాక్ దేశాలకు పలుమార్లు వెళ్లివచ్చినట్లు గుర్తించారు. ముఖ్యంగా గత ఏడాదిలోనే అనేకసార్లు ఆ దేశాలకు ప్రయాణించినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఈ ప్రయాణాల వెనుక ఉద్దేశం ఏమిటి, కుట్రకు అంతర్జాతీయ సంబంధాలు ఉన్నాయా, విదేశాల నుంచి ఎవరైనా ప్రోత్సహించారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. అతని మొబైల్ ఫోన్, డిజిటల్ సమాచారం, బ్యాంకు లావాదేవీలను కూడా నిశితంగా పరిశీలిస్తున్నారు.

**హత్యాయత్నం సహా పలు కేసులు నమోదు**

నిందితుడిపై హత్యాయత్నం, విషప్రయోగం తదితర తీవ్ర నేరాలకు సంబంధించిన భారతీయ న్యాయ సంహిత నిబంధనల కింద కేసులు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న కాప్సూల్స్‌ను న్యాయ వైద్య పరీక్షల కోసం పంపించగా, దర్యాప్తు అన్ని కోణాల్లో కొనసాగుతోందని ముంబై పోలీసులు వెల్లడించారు. ఈ కుట్ర వెనుక మరెవరైనా ఉన్నారా అనే అంశంపై కూడా విచారణ ముమ్మరం చేశారు.

# విమానాశ్రయాల్లో మద్యం విక్రయాలకు గ్రీన్ సిగ్నల్

- తిరుపతి మినహా అన్ని ఎయిర్‌పోర్టుల్లో బార్‌లు, వైన్ షాపులకు అనుమతి.
- విమానాశ్రయాల మద్యం విక్రయాలపై కొత్త ఎక్సైజ్ మార్గదర్శకాలు.
- ఇరవై నాలుగు గంటలపాటు విక్రయాలకు అవకాశం.. ప్రభుత్వం ఉత్తర్వులు.
- లైసెన్స్ ఫీజులు, పన్నులపై స్పష్టత.. మూడేళ్ల తర్వాత విధాన సమీక్ష.



**అమరావతి, మహా :** రాష్ట్రంలోని విమానాశ్రయాల్లో ప్రయాణికులకు మరిన్ని వాణిజ్య సదుపాయాలు కల్పించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తిరుపతి విమానాశ్రయాన్ని మినహాయించి రాష్ట్రంలోని మిగతా అన్ని విమానాశ్రయాల్లో మద్యం విక్రయాలకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బార్‌లు, వైన్ షాపుల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పాటు లైసెన్స్ ఫీజులు, ఎక్సైజ్ పన్నులు, నిర్వహణకు సంబంధించిన సమగ్ర మార్గదర్శకాలను కూడా ప్రభుత్వం ప్రకటించింది.

**విమానాశ్రయాల్లో మద్యం విక్రయాలకు అనుమతి**

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వుల ప్రకారం తిరుపతి మినహా మిగిలిన అన్ని విమానాశ్రయాల్లో బార్‌లు, వైన్ షాపులు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి లభించనుంది. దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. విమానాశ్రయాల్లో అందుబాటులో ఉండే వాణిజ్య సేవలను మరింత విస్తరించడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం వెల్లడించింది.

**ఇరవై నాలుగు గంటలపాటు విక్రయాలకు అవకాశం**

విమానాశ్రయాల ప్రత్యేక స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని బార్‌లు, వైన్ షాపులకు 24 గంటలపాటు కార్యకలాపాలు నిర్వహించేందుకు అనుమతి కల్పించింది. రాత్రింబవళ్లు విమానాల రాకపోకలు కొనసాగే నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ వెసులుబాటు కల్పించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**లైసెన్స్ ఫీజులు, ఎక్సైజ్ పన్నులపై మార్గదర్శకాలు**

విమానాశ్రయాల్లో బార్ లైసెన్స్ కోసం దరఖాస్తు రుసుమును 5 లక్షల రూపాయలుగా ప్రభుత్వం నిర్ణయించింది. వైన్ షాపు లైసెన్స్ దరఖాస్తు రుసుము 2 లక్షల రూపాయలుగా ఖరారు చేసింది. విమానాశ్రయంలో వైన్ షాపు నిర్వహణకు ఎక్సైజ్ పన్ను 2 కోట్ల రూపాయలుగా నిర్ణయించగా, వార్షిక ప్రయాణికుల రాకపోకలు ఇరవై లక్షలకు మించిన విమానాశ్రయాల్లో బార్‌లకు 25 లక్షల రూపాయల ఎక్సైజ్ పన్ను విధించనుంది. 20 లక్షలలోపు ప్రయాణికుల రాకపోకలు ఉన్న విమానాశ్రయాల్లో ఈ పన్ను 15 లక్షల రూపాయలుగా ఉండనుంది.

**తిరుపతికి మినహాయింపు**

ప్రభుత్వ ఉత్తర్వుల్లో తిరుపతి విమానాశ్రయానికి ప్రత్యేక మినహాయింపు ఇచ్చింది. ఆధ్యాత్మిక ప్రాధాన్యం, తిరుమల క్షేత్రానికి అనుసంధానమైన ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అక్కడ ఈ అనుమతిని వర్తింపజేయలేదు. మిగిలిన అన్ని విమానాశ్రయాల్లో మాత్రం కొత్త నిబంధనల ప్రకారం బార్‌లు, వైన్ షాపుల ఏర్పాటుకు మార్గం సుగమమైంది.

**మూడేళ్ల తర్వాత విధాన సమీక్ష**

కొత్త విధానం అమలులోకి వచ్చిన అనంతరం మూడు సంవత్సరాల తర్వాత దాని ప్రభావం, ఆదాయ పరిస్థితులు, అమలులో ఎదురయ్యే అంశాలను సమగ్రంగా సమీక్షిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. అవసరమైతే పరిస్థితులకు అనుగుణంగా విధానంలో మార్పులు, చేర్పులు చేపట్టే అవకాశం ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది.

**ఆదాయ వృద్ధితో పాటు ప్రయాణికుల సేవల విస్తరణ లక్ష్యం**

విమానాశ్రయాల్లో మద్యం విక్రయాలకు అనుమతి ఇవ్వడం ద్వారా ప్రభుత్వానికి అదనపు ఎక్సైజ్ ఆదాయం సమకూరడంతో పాటు ప్రయాణికులకు అంతర్జాతీయ ప్రమాణాల సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు భావిస్తున్నారు. కొత్త విధానం అమలుతో విమానాశ్రయాల్లో వాణిజ్య కార్యకలాపాలు మరింత విస్తరించే అవకాశముందని, అదే సమయంలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, అనుమతుల మేరకే మద్యం విక్రయాలు కొనసాగనున్నట్లు స్పష్టం చేసింది.

## సెక్యూరిటీ తొలగింపుపై భగ్గుమన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**భద్రత తీసేసినంత మాత్రాన వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు**

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే తన భద్రతను (సెక్యూరిటీ) తొలగించడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ భవిష్యత్తులో తనకు ప్రాణాపాయం గానీ, మరేదైనా హాని గానీ జరిగితే దానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే పూర్తి బాధ్యత అని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం తనపై ఉద్దేశపూర్వకంగా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ప్రవీణ్ ఆరోపించారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే అధికార పార్టీ తనను లక్ష్యంగా చేసుకుందని ఆయన దుయ్యబట్టారు. విపక్ష నేతగా ప్రజాపక్షాన నిలబడి ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే తనను ఇలాంటి వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఒక మాజీ ఉన్నతాధికారిగా, ప్రజానేతగా నిరంతరం ప్రజల్లో ఉండే తనకు కనీస రక్షణ లేకుండా చేయడం వెనుక ప్రభుత్వ అసలు ఉద్దేశం ఏంటని ఆయన సూటిగా ప్రశ్నించారు.తాను చేసే ప్రతి పోరాటం కేవలం ప్రజల కోసమేనని, అందులో తనకెలాంటి వ్యక్తిగత స్వార్థం లేదని ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. తన భద్రతను తొలగించినంత మాత్రాన తాను భయపడి వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. తన గొంతు నొక్కాలని చూస్తే ఊరుకోబోనని, ప్రజల తరఫున ఇకముందు మరింత బలంగా గొంతెత్తుతానని ఆయన ప్రభుత్వానికి స్పష్టం చేశారు.

# పరిశోధనల్లో నాణ్యత సంక్షోభం

- ఉపసంహరణల్లో ప్రపంచంలో భారత్‌కు రెండో స్థానం.
- రిట్రాక్షన్లలో భారత వర్సిటీలకు చేదు రికార్డు.
- అన్నా యూనివర్సిటీకి తొలి స్థానం.
- ఐదో స్థానంలో హైదరాబాద్ జేఎన్‌టీయూ.
- నాణ్యత లోపాలతో వెనక్కి వేలాది పత్రాలు.
- పరిశోధనల విశ్వసనీయతకు ఎదురుదెబ్బ.
- కఠిన చర్యలకు కేంద్రం శ్రీకారం.



**ఢిల్లీ, మహా.:** అంతర్జాతీయ పరిశోధన రంగంలో అగ్రగామిగా ఎదగాలన్న భారత లక్ష్యానికి తాజా గణాంకాలు గట్టి హెచ్చరికగా మారాయి. పరిశోధన పత్రాల ఉపసంహరణల్లో ప్రపంచవ్యాప్తంగా భారత్ రెండో స్థానంలో నిలవడం, అత్యధిక రిట్రాక్షన్లు నమోదైన తొలి పది విశ్వవిద్యాలయాల జాబితాలో ఆరు భారతీయ విద్యాసంస్థలు చోటు దక్కించుకోవడం దేశ ఉన్నత విద్యా వ్యవస్థలో నాణ్యతా ప్రమాణాలపై తీవ్ర చర్చకు దారితీసింది. పరిశోధనలో ప్రమాణాల కంటే ప్రచురణల సంఖ్యకే అధిక ప్రాధాన్యం ఇవ్వడం ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**రిట్రాక్షన్లలో భారత్‌కు రెండో స్థానం**

పరిశోధన పత్రాల ఉపసంహరణలను నమోదు చేసే అంతర్జాతీయ డేటాబేస్ వెల్లడించిన వివరాల ప్రకారం 2025లో ప్రపంచవ్యాప్తంగా అత్యధిక రిట్రాక్షన్లు నమోదైన దేశాల్లో చైనా మొదటి స్థానంలో నిలిచింది. చైనాలో 1,701 పరిశోధన పత్రాలు ఉపసంహరణకు గురికాగా, భారత్‌లో 887 పరిశోధన పత్రాలు వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. ప్రపంచ పరిశోధనల్లో భారతదేశం వాటా సుమారు ఐదు శాతం మాత్రమే ఉన్నప్పటికీ, ఉపసంహరణల్లో మాత్రం ఇరవై ఒక్క శాతం వాటా నమోదవడం ఆందోళన కలిగిస్తోంది.

**ప్రపంచ టాప్–10లో ఆరు భారతీయ వర్సిటీలు**

అత్యధిక రిట్రాక్షన్లు నమోదైన ప్రపంచ తొలి పది విశ్వవిద్యాలయాల జాబితాలో ఏకంగా ఆరు భారతీయ విద్యాసంస్థలు చోటు దక్కించుకున్నాయి. చెన్నైలోని అన్నా యూనివర్సిటీ 161 పరిశోధన పత్రాల ఉపసంహరణతో ప్రపంచంలోనే తొలి స్థానంలో నిలిచింది. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం టెక్నికల్ యూనివర్సిటీ 160 రిట్రాక్షన్లతో రెండో స్థానంలో ఉండగా, సవీత ఇన్‌స్టిట్యూట్ 159 ఉపసంహరణలతో మూడో స్థానంలో నిలిచింది. హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ 104 రిట్రాక్షన్లతో ఐదో స్థానాన్ని, లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ 98 ఉపసంహరణలతో ఆరో స్థానాన్ని దక్కించుకున్నాయి.

**నాణ్యత కంటే సంఖ్యకే ప్రాధాన్యం**

పరిశోధనల నాణ్యతను పక్కనపెట్టి ఎక్కువ సంఖ్యలో పత్రాలను ప్రచురించడంపైనే దృష్టి పెట్టడం ఈ పరిస్థితికి ప్రధాన కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. అకడమిక్ పదోన్నతులు, ర్యాంకులు, పరిశోధన నిధుల కోసం అధిక సంఖ్యలో ప్రచురణలు అవసరమనే ఒత్తిడి కారణంగా అనేక పరిశోధనలు తగిన ప్రమాణాలు పాటించకుండా ప్రచురితమవుతున్నాయని విశ్లేషిస్తున్నారు.

**రిట్రాక్షన్లకు దారితీసిన కారణాలు**

పరిశోధనల్లో డేటా లోపాలు, తప్పుడు లేదా నిర్ధారణ లేని ఫలితాలు, పునరావృత ప్రచురణలు, పరిశోధనా నైతిక ప్రమాణాల ఉల్లంఘన, కృత్రిమ మేధ ఆధారంగా రూపొందించిన విషయాలను సరైన ధృవీకరణ లేకుండా వినియోగించడం వంటి అంశాల కారణంగా అనేక అంతర్జాతీయ జర్నల్లు ఈ పరిశోధన పత్రాలను ఉపసంహరించుకున్నాయి. దీంతో భారతీయ పరిశోధనల విశ్వసనీయతపై అంతర్జాతీయ స్థాయిలో ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**కేంద్రం కఠిన చర్యలు**

ఈ పరిణామాలను తీవ్రంగా పరిగణించిన కేంద్ర ప్రభుత్వం పరిశోధనల్లో నాణ్యత పెంపుపై దృష్టి సారించింది. 2025 నుంచి జాతీయ విద్యాసంస్థల ర్యాంకింగ్ విధానంలో పరిశోధన పత్రాల ఉపసంహరణలను కూడా ఒక ప్రమాణంగా పరిగణిస్తూ, ఎక్కువ రిట్రాక్షన్లు ఉన్న విద్యాసంస్థలకు పెనాల్టీలు విధించే విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా విద్యాసంస్థలపై ఒత్తిడి పెరగనుంది.

**పరిశోధనల విశ్వసనీయతే అసలైన సవాలు**

పరిశోధన పత్రాల సంఖ్య పెరగడం మాత్రమే అభివృద్ధికి సూచిక కాదని, వాటి నాణ్యత, విశ్వసనీయత, శాస్త్రీయ ప్రమాణాలే అత్యంత కీలకమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. అంతర్జాతీయ స్థాయిలో భారత పరిశోధనలకు గౌరవం పెరగాలంటే ప్రచురణల సంఖ్యపై కాకుండా నాణ్యమైన పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

# సీసీటీవీలు ఆపి వేల కోట్లు కాజేయగలరా?.

- పెద్దల ప్రమేయంపై ప్రియాంక ప్రశ్నలు.
- కింది స్థాయి ఉద్యోగులతోనే సాధ్యమా?.
- ప్రియాంక, కేజ్రీవాల్ ఘాటు వ్యాఖ్యలు



**అయోధ్య, మహా :** అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ తీవ్రస్థాయిలో స్పందించారు. సీసీటీవీ కెమెరాలను నిలిపివేసి భారీ స్థాయిలో అక్రమాలు కేవలం కింది స్థాయి ఉద్యోగుల వల్లే జరిగాయా? లేక దీని వెనుక పెద్దల ప్రమేయం ఉందా? అనే ప్రశ్నలను లేవనెత్తారు. ఇదే సమయంలో సిట్ మధ్యంతర నివేదికలో వెలుగుచూసిన అంశాలు వ్యవహారాన్ని మరింత సంచలనంగా మార్చాయి. అయోధ్య రామాలయంలో భక్తులు సమర్పించిన విరాళాల దుర్వినియోగంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం కింది స్థాయి ఉద్యోగులు తమంతట తామే సీసీటీవీ కెమెరాలను నిలిపివేసి భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడటం సాధ్యమేనా అని ప్రశ్నించారు. ఈ ఘటన వెనుక ఉన్న అసలు బాధ్యులను గుర్తించి, ఎవరైనా సరే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.ఈ వ్యవహారాన్ని కప్పిపుచ్చే ప్రయత్నాలు కాకుండా పూర్తిస్థాయి పారదర్శక విచారణ జరగాలని ప్రియాంక గాంధీ కోరారు. రామమందిరం కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీక అని, భక్తులు భక్తిశ్రద్ధలతో సమర్పించే విరాళాల దుర్వినియోగం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. సత్యం, ధర్మానికి ప్రతీకగా భావించే శ్రీరాముడి ఆలయంలో ఇటువంటి ఆరోపణలు రావడం దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోందని ఆమె వ్యాఖ్యానించారు. ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కూడా ఈ వ్యవహారంపై స్పందించారు. కేవలం చిన్నస్థాయి ఉద్యోగులను అరెస్టు చేయడం వల్ల అసలు నిజాలు వెలుగులోకి రావని అన్నారు. ఇందులో ప్రమేయం ఉన్న పెద్దలపై కూడా విచారణ జరిపి, దోషులెవరైనా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేవలం రాజీనామాలతో వ్యవహారం ముగిసిపోదని, అసలు బాధ్యులను గుర్తించడం ద్వారానే ప్రజలకు న్యాయం జరుగుతుందని వ్యాఖ్యానించారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం మధ్యంతర నివేదికలో పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. నోట్ల లెక్కింపు సమయంలో కొందరు సిబ్బంది ఉద్దేశపూర్వకంగా సీసీటీవీ కెమెరాలకు అడ్డుగా నిలబడటం, నోట్ల కట్టల నుంచి నగదు తీసి దుస్తుల్లో దాచుకోవడం, చోరీ చేసిన నగదును మరుగుదొడ్లలో దాచడం వంటి ఘటనలు రహస్య కెమెరాల్లో నమోదైనట్లు దర్యాప్తులో వెల్లడైంది. రామాలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన విరాళాలను బ్యాంకుల్లో జమ చేసే సమయంలో నోట్ల కట్టల్లో నగదు తక్కువగా ఉండటాన్ని అధికారులు గుర్తించారు. ముఖ్యంగా ఐదు వందల రూపాయల నోట్ల కట్టల్లో పదేపదే నగదు కొరత కనిపించడంతో అనుమానాలు మొదలయ్యాయి. అనంతరం సిబ్బందికి తెలియకుండా రహస్య కెమెరాలు ఏర్పాటు చేయగా, అక్రమాల దృశ్యాలు నమోదైనట్లు సిట్ దర్యాప్తులో తేలింది.

# యూరప్‌లో అత్యధిక విస్తీర్ణం రష్యాదే

- ఐక్యరాజ్యసమితి గణాంకాలు.
- యూరప్ భూభాగంలో దాదాపు నలభై శాతం రష్యా ఆక్రమణ.
- విస్తీర్ణంలో రష్యా అగ్రస్థానం.. తర్వాత ఉక్రెయిన్, ఫ్రాన్స్.
- యూరప్ దేశాల విస్తీర్ణంపై ఆసక్తికర గణాంకాలు.

**ఢిల్లీ, మహా.:** యూరప్ ఖండంలో అత్యధిక భూభాగాన్ని కలిగిన దేశంగా రష్యా మరోసారి అగ్రస్థానంలో నిలిచింది. ఐక్యరాజ్యసమితి ఆధారంగా విడుదలైన గణాంకాల ప్రకారం యూరప్ మొత్తం విస్తీర్ణంలో రష్యా వాటా దాదాపు నలభై శాతానికి చేరుకుంది. రష్యా తర్వాత ఉక్రెయిన్, ఫ్రాన్స్, స్పెయిన్, స్వీడన్ దేశాలు అత్యధిక విస్తీర్ణం కలిగిన దేశాలుగా నిలిచాయి. మరోవైపు వాటికన్, మొనాకో, శాన్ మారినో వంటి సూక్ష్మ దేశాల విస్తీర్ణం యూరప్ మొత్తం భూభాగంలో అత్యల్పంగా ఉంది. రష్యాదే అతిపెద్ద వాటా గణాంకాల ప్రకారం యూరప్ మొత్తం భూభాగంలో రష్యా వాటా 39.5 శాతంగా నమోదైంది. అంటే యూరప్‌లో దాదాపు ప్రతి ఐదు చదరపు కిలోమీటర్లలో రెండు చదరపు కిలోమీటర్లు రష్యా భూభాగమే అవుతుంది. ఈ విస్తీర్ణమే రష్యాను యూరప్‌లోనే అతిపెద్ద దేశంగా నిలిపింది. ఉక్రెయిన్, ఫ్రాన్స్ తర్వాతి స్థానాల్లో రష్యా తర్వాత 6 శాతం విస్తీర్ణంతో ఉక్రెయిన్ రెండో స్థానంలో ఉంది. ఫ్రాన్స్ 5.4 శాతం, స్పెయిన్ 5 శాతం, స్వీడన్ 4.4 శాతం వాటాతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. జర్మనీ, ఫిన్లాండ్, నార్వే, పోలాండ్, ఇటలీ కూడా యూరప్‌లో విస్తీర్ణపరంగా ప్రధాన దేశాలుగా ఉన్నాయి. మధ్యస్థ విస్తీర్ణం కలిగిన దేశాలు యునైటెడ్ కింగ్‌డమ్, రొమేనియా చెరో 2.4 శాతం వాటాతో ఉన్నాయి. బెలారస్ 2.1 శాతం, కజకిస్థాన్ 1.5 శాతం, గ్రీస్ 1.3 శాతం, బల్గేరియా 1.1 శాతం వాటాతో యూరప్‌లో గణనీయమైన భూభాగాన్ని కలిగి ఉన్నాయి. సూక్ష్మ దేశాల వాటా అత్యల్పం లక్సెంబర్గ్, అండోరా, మాల్టా, లిక్టెన్‌స్టెన్, శాన్ మారినో, మొనాకో, వాటికన్ వంటి చిన్న దేశాల విస్తీర్ణం యూరప్ మొత్తం భూభాగంలో అతి స్వల్పంగా ఉంది. మొనాకో, వాటికన్ వాటా దాదాపు సున్నా శాతానికి సమానంగా ఉండగా, మాల్టా, అండోరా వంటి దేశాల వాటా కూడా ఒక శాతం కంటే చాలా తక్కువగా నమోదైంది. భౌగోళిక నిర్వచనాల ఆధారంగా లెక్కలు ఈ గణాంకాల్లో యూరప్‌లో కొంత భాగం మాత్రమే ఉన్న దేశాలైన కజకిస్థాన్, టర్కీ, అజర్‌బైజాన్, జార్జియా వంటి దేశాల యూరోపియన్ భూభాగాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు. అలాగే ఖండాల సరిహద్దుల భౌగోళిక నిర్వచనాల ప్రకారం ఈ లెక్కలు రూపొందించబడినట్లు ఐక్యరాజ్యసమితి ప్రమాణాలు సూచిస్తున్నాయి.

# రోడ్డుపై కనిపించిన ఆర్. నారాయణమూర్తి

- కారు ఆపి మరీ పలకరించిన హిమాన్షు రావు.
- నిరాడంబర నటుడికి యువ నాయకుడి గౌరవం.
- నారాయణమూర్తి–హిమాన్షు భేటీపై ప్రశంసలు





**హైదరాబాద్,మహా :** సాధారణంగా ప్రముఖుల మధ్య జరిగే చిన్న సంఘటనలు కూడా సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారుతుంటాయి. అలాంటి ఓ సంఘటన హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. తెలుగు సినీ పరిశ్రమలో తన నిరాడంబర జీవనశైలితో ప్రత్యేక గుర్తింపు పొందిన సీనియర్ నటుడు, దర్శకుడు ఆర్. నారాయణమూర్తిని రోడ్డుపై గమనించిన హిమాన్షు రావు తన వాహనాన్ని ఆపి, స్వయంగా వెళ్లి మర్యాదపూర్వకంగా పలకరించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి.

**రోడ్డుపై కనిపించిన నారాయణమూర్తి**

హైదరాబాద్‌లోని శ్రీనగర్ కాలనీ ప్రాంతంలో ఆర్. నారాయణమూర్తి ఎప్పటిలాగే ఎలాంటి హంగు ఆర్భాటాలు లేకుండా ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తుండగా, అదే మార్గంలో ప్రయాణిస్తున్న హిమాన్షు రావు ఆయనను గుర్తించారు. వెంటనే తన వాహనాన్ని పక్కకు ఆపి కిందికి దిగి నేరుగా నారాయణమూర్తి వద్దకు వెళ్లారు.

**వినయంగా పలకరించిన హిమాన్షు**

ఆర్. నారాయణమూర్తిని కలిసిన హిమాన్షు రావు ఆయనకు వినయపూర్వకంగా నమస్కరించి, ఆరోగ్యం, యోగక్షేమాల గురించి ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. కొద్దిసేపు ఆయనతో ముచ్చటిస్తూ గౌరవభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి నిరాడంబర జీవనశైలిపై హిమాన్షు ప్రశంసలు వ్యక్తం చేసినట్లు వీడియోలో కనిపిస్తోంది.

**నిరాడంబర జీవనశైలిపై ప్రశంసలు**

సినీ పరిశ్రమలో విశిష్ట గుర్తింపు సాధించినప్పటికీ ఆర్. నారాయణమూర్తి ఇప్పటికీ అత్యంత సాధారణ జీవన విధానాన్నే అనుసరిస్తుండడం తనను ఆకట్టుకుందని హిమాన్షు పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ వయసులో కూడా ఆయనలో కనిపిస్తున్న సాదాసీదా జీవనశైలి, నిరాడంబరత యువతకు ఆదర్శంగా నిలుస్తాయని అభిప్రాయపడినట్లు సమాచారం.

**సామాజిక మాధ్యమాల్లో వైరల్**

ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వేగంగా వైరల్ అవుతోంది. పలువురు నెటిజన్లు ఈ దృశ్యాన్ని ప్రశంసిస్తూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. పెద్దలను గౌరవించే సంస్కారం, వినయం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుందని కామెంట్లు చేస్తున్నారు.

**నెటిజన్ల స్పందనలు**

ఈ వీడియోపై సామాజిక మాధ్యమాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక వర్గం నెటిజన్లు హిమాన్షు రావు చూపిన మర్యాద, పెద్దల పట్ల గౌరవాన్ని అభినందిస్తుండగా, మరికొందరు ఆర్. నారాయణమూర్తి నిరాడంబర జీవనశైలిని ప్రశంసిస్తున్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారు ఇలాంటి విలువలను కొనసాగించడం సమాజానికి మంచి సందేశమని పలువురు అభిప్రాయపడుతున్నారు.


# విన్నపాలు వినవలే...

కుప్పలు.. తెప్పలు... అవన్నీ సమస్యల పరిష్కారం కోసం పెట్టుకున్న అర్జీలు... ఇవి ఇప్పుడు గుట్టలుగా పేరుకు పోతున్నాయి. అధికారులకు గుండె దడ పుట్టిస్తున్నాయి. ఇంతకీ ఏమిటీ అర్జీలు అంటే తెలంగాణ సర్కార్ నిర్వహిస్తున్న ప్రజా వేదికలో వచ్చిన విన్నపాలు. రెండున్నర సంవత్సరాలనుండి నిరంతరం సాగుతున్న ప్రజా వేదిక ద్వారా తమ బాధలు, సమస్యలు, వినతులు, విజ్ఞప్తులు సదరు బాధితులు ప్రభుత్వం ముందు ఉంచారు. వాటి పరిష్కారం, సమాధానం సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. లక్షల కొద్దిగా వచ్చి పడుతున్న అర్జీలు అధికారులను ఉక్కిరి, బిక్కిరి చేస్తున్నాయి. ఇందులో కొన్ని పరిష్కారానికి నోచుకున్నాయి. అయితే పరిష్కారం కోసం ఎదురు చూస్తున్న అర్జీలు లక్షల్లో వున్నాయి. అర్జీల కట్టలు గుట్టలుగా ప్రభుత్వ కార్యాలయాల్లో పేరుకు పోతున్నాయి. దుమ్ము పట్టి అధికారులకు ఊపిరి ఆడకుండా చేస్తున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రోజుల నుంచే సీఎం రేవంత్ రెడ్డి ఈ ప్రజా వేదిక కార్యక్రమం మొదలు పెట్టారు. ఇందుకు ఆయన ఓ ప్రత్యేక విధానం కూడా ఏర్పాటు చేశారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా ప్రభుత్వం ముందుకు తీసుకొని వచ్చే పద్ధతికి శ్రీకారం చుట్టారు. ప్రారంభం ఏడాదిలో ఇది మంచి ఫలితాలు ఇచ్చింది. ప్రజల ఇక్కట్లు తీరటంతో ప్రజా వేదిక పై ప్రజలకు విశ్వాసం వచ్చింది. అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేసినా పరిష్కారం కానీ అనేక సమస్యలు ప్రజా వేదిక వల్ల ఓ కొలిక్కి వచ్చాయి. దీంతో ప్రజలు ప్రభుత్వం ఆఫీసులకు వెళ్ళటం తగ్గించారు. తమ సమస్యను, వినతులను నేరుగా ప్రజా వేదిక ముందు పెట్టటం మొదలు పెట్టారు. ఇలా ప్రజా వేదికకు వచ్చిన అర్జీలు పరిశీలన చేసి సంబదించిన విభాగంకు వాటిని పంపుతున్నారు. ఇక్కడే సమస్య మళ్ళీ మొదటికి వస్తోంది అంటున్నారు ప్రజలు. మనిషి ఆశాజీవి. తనకు ఏదైనా మేలు జరుగుతుంది అంటే దాన్ని ప్రయత్నించటం మానవనైజం. ప్రభుత్వమే మీకు చేయూతగా ఉంటాం, రండీ అంటూ పిలుపునిస్తే ప్రజలు ఆగుతారా? ఈ అవకాశం కోసమే వాళ్ళు ఎదురు చూపులు చూస్తున్న సమయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజావాణి, ప్రజా వేదికలంటూ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఇంకేంటి. ఆబాలగోపాలం ఈ పిలుపు అందుకున్నారు. చేతిలో అర్జీలతో ప్రజా వేదికల వద్ద బారులు తీరారు. మొదటి సారి ప్రజా వేదికకు అనూహ్యస్పందన వచ్చింది. లక్షల కొద్దీ అర్జీలు ప్రజల నుంచి వచ్చాయి. ఇందులో ఎక్కువగా పింఛన్లు, ఇళ్ల స్థలాలు, ఇళ్ళు, ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు ఇలా అర్జీల కుప్ప వచ్చి చేరింది. అయితే రేషన్ కార్డులకు పెద్ద ఎత్తున అర్జీలు రావటంతో కేవలం రేషన్ కార్డుల కోసం మరో సారి ప్రభుత్వం వేదికలు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఇక మొదటి దఫా ప్రజా వేదికలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికి అవి దక్కాయి. దీంతో ప్రజావాణి, వేదికపై ప్రజలకు మరింతగా విశ్వాసం పెరిగింది. ఏ సమస్య వున్నా ప్రజా వేదిక వద్దకే ప్రజలు రావటం మొదలు పెట్టారు. చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం గ్రామ సచివాలయం వున్నా ప్రజలు వాటిని పట్టించుకోవటం లేదు. ఇందుకు కారణం లేక పోలేదు. గ్రామ సచివాలయంలో సిబ్బంది ఎప్పుడు వుంటారో, ఉండరో తెలియని పరిస్థితి వుంది. ఒక వేళ వున్నా సంబంధించిన అర్జీలపై వారి స్పందన అంతంత మాత్రమే అంటున్నారు ప్రజలు. ఇదే వారిని ప్రజా వేదిక, వాణి వైపు అడుగులు వేసేలా చేసింది.

ప్రజా వేదికల ద్వారా వచ్చిన దరఖాస్తులు అధికారులకు తల నొప్పిగా మారుతున్నాయి. ఇందులో స్థానిక సమస్యలకు సంబంధించిన అర్జీలు కూడా పెద్ద సంఖ్యలో ఉంటున్నట్లు అధికారులు చెప్తుతున్నారు. దీంతో చాలా అర్జీల పరిశీలన అధికారులు పక్కన పెట్టేసారు అన్నది వాస్తవం. కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో కేవలం ఓ 16 శాతం మందికే కార్డులు మంజూరు అయ్యాయి. మిగితా అర్జీలు అలాగే వున్నాయి. అర్జీల పరిశీలనలో జాప్యం ఉండటం, అద్దె నివాసల్లో వున్న వారు ఖాళీ చేసి మరో ప్రాంతాలకు వెళ్ళటం, దీంతో క్షేత్ర స్థాయి తనిఖీలకు వెళ్లినప్పుడు సదరు అర్జీదారుల చిరునామా లభ్యం కాక పోవటం వల్ల ఇబ్బంది వస్తోందనీ అధికారులు అంటున్నారు. మరో ప్రాంతానికి తరలి వెళ్లిన వారు తిరిగి అక్కడ అర్జీలు పెట్టుకుంటున్నారు. ఇలా అర్జీల సంఖ్య లెక్క తేలని చిక్కుముడిగా మారిపోయింది. కొందరు తమ అర్జీలకు ఇప్పటి వరకు ఎలాంటి సమాధానం రాలేదని కూడా అంటున్నారు. దీనికి కూడా అధికారులు సమాధానం సరిగా ఇవ్వట్లేదు. అర్జీదారులు ఇచ్చిన ఫోన్ నెంబర్, అడ్రస్ తేడా ఉండటం వల్ల కమ్యూనికేష్ కష్టంగా ఉంటోందన్నది అధికారుల సమాధానం. ఇప్పటికే లక్షల కొద్దీ అర్జీలు పెండింగ్ లో వున్నాయి. వీటిని అధికారులు ఎప్పుడు పరిశీలించి సంబంధించిన వ్యక్తులకు న్యాయం చేస్తారు అన్నది సమాధానం దొరకని ప్రశ్నగా మారుతోంది. ప్రజావాణి, వేదికలకు వచ్చిన అర్జీలలో ఏయే అంశాలు ఉన్నాయో, అవి ఏ శాఖకు సంబంధించినవో కూడా ఇంకా అధికారులు పరిశీలన చేయలేదని సమాచారం. ఓ వైపు ప్రజావాణి, వేదికలు జోరుగా సాగిపోతున్నాయి. ఇంకో వైపు అర్జీలు వస్తూనే వున్నాయి. కానీ పరిష్కారం ఎక్కడ? ఎప్పుడు? అనేదే ఇప్పుడు అంతు పట్టట్లేదు.

కొత్త ఫించన్ల కోసం ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. సుమారు అయిదు లక్షల మందికి పైగానే ఫించన్ కోసం దరఖాస్తులు చేసుకున్నట్లు సమాచారం. ఇప్పుడు ప్రభుత్వం వీటిపై దృష్టి పెట్టింది. ఫించన్ కోసం అర్జీలు పెట్టుకున్న వారిలో అర్హులు ఎవ్వరు? అనేది అధికారులు లెక్కలు తీస్తున్నారు. ఈ వ్యవహారం పూర్తి అయితే కానీ కొత్తగా ఫించన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి అవి లభ్యం కావు. ఇక రేషన్ కార్డుల వ్యవహారం కూడా ఇదే పరిస్థితి. ఇందిరమ్మ ఇళ్ల అంశం మాత్రం ఇప్పుడు వేగంగా కదులుతోంది. ఈ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు అధికారులు చక చక పూర్తి చేస్తున్నారు. స్థలం ఉండి ఇళ్ళు కట్టుకోవటానికి ఆర్థిక సహాయం కోరుతున్న వారికి త్వరలో నిధులు మంజూరు చేసే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. అయిదు లక్షల రూపాయలు వారికి అందించేందుకు జాబితాలు సిద్ధం అవుతున్నట్టు అధికారులు చెప్తుతున్నారు.


రేవంత్ రెడ్డి సర్కార్ పై ప్రజలు చాలా ఆశలు పెట్టుకున్నారు. పెట్టే వారీ వద్దకే జనం చేరుతారు అనే నానుడి ఇప్పుడు రేవంత్ రెడ్డి విషయంలో అక్షరాల నిజం అవుతోంది. ఇళ్ళు, ఫించన్లు, రేషన్ కార్డులు, ఇతర అంశాలను సీఎం దృష్టిలో పడేలా చేసేందుకు ప్రజా వేదిక, ప్రజా వాణి ఓ వారధి అయింది. ఇంత వరకు బాగానే వుంది. ఇక్కడ ఓ ప్రమాదం కూడా పొంచి వుంది. ఇళ్ళు, రేషన్ కార్డులు, ఫించన్లు ఇలా ఏదైనా సరే అవి అర్హులకు మాత్రమే చేరాలి. అలా కాకుండా మరో తరహాలో అవి మంజూరు అయితే ప్రభుత్వం పై ప్రజలకు వ్యతిరేక భావం వస్తుంది. ఇక అర్జీలు పెట్టుకున్న వారిలో ఓ పది శాతం మందికి మాత్రమే పరిష్కారం లభించి, 90 శాతం మందికి నిరాశ కలిగిస్తే కూడా ప్రభుత్వానికి అది ఇబ్బందికరంగా మారుతుంది. ముందు అర్జీల పరిశీలన అత్యంత కీలకం. అందులో అర్హులు ఎవరు? అనర్హులు ఎవరు? ఎందుకు? ఈ విషయాలు ప్రజలకు, ముఖ్యంగా అర్జీలు పెట్టుకున్న వారికి ఖచ్చితంగా తెలియజేయాల్సి ఉంటుంది. ఇది కీలకం. అసలు అర్జీల పరిశీలన ప్రక్రియ విషయంలోనే అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే అది వికటించక తప్పదు. అది ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తుంది. దీన్ని సీఎం రేవంత్ రెడ్డితో సహా మంత్రులు గుర్తించాలి. ఇప్పటికి అయినా గుట్టలుగా పడి వున్న అర్జీల కట్టలు విప్పే అంశం పై అధికారులు దృష్టి పెట్టాలి. వాటి పరిష్కారం వైపు అడుగులు వేయాలి. అలాంటి ఖచ్చితమైన విధానం ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి తీసుకొని రావాలి. అప్పుడే ప్రజా వేదిక, వాణి ప్రయోజనం ప్రజలకు చేరువ అవుతుంది. అర్జీలకు మోక్షం వస్తుంది.



- జీ. వెంకటరమణ,
సీనియర్ జర్నలిస్ట్.

# సామాన్యుడి సందేహం..

నిజంగా నేను ఈ దేశ పౌరుడినే అని నిరూపించుకోవాలంటే ఏం చేయాలి, ఆధారం ఏం చూపాలి అన్న ప్రశ్న ప్రస్తుతం పది మందిలో ఎనిమిది మందిని వేధిస్తున్న ప్రశ్న. నిన్న అసాంలో ఎదురైన సమస్య రేపు దేశమంతా ఉత్పన్నమైతే పరిస్థితి ఏంటన్నది ప్రస్తుతం సర్వత్రా జరుగుతున్న చర్చ. భారతదేశంలో నివసిస్తున్న ప్రతి సామాన్య పౌరుడి వద్ద ఓటర్ ఐడీ, ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, పాస్‌పోర్ట్ వంటి అనేక ప్రభుత్వ గుర్తింపు పత్రాలు ఉంటాయి. అయితే, ఇటీవలి కాలంలో సుప్రీంకోర్టు తీర్పులు, వివిధ ప్రభుత్వ మంత్రిత్వ శాఖల వివరణల ప్రకారం.. ఇవేవీ కూడా ఒక వ్యక్తి భారత పౌరుడు అనడానికి సంపూర్ణమైన లేదా తిరుగులేని చట్టపరమైన సాక్ష్యాలు కావనే నిశ్శబ్ద సత్యం సామాన్యుడిని తీవ్ర గందరగోళానికి గురిచేస్తోంది. పాస్‌పోర్ట్ సేవా దివస్ సందర్భంగా విదేశాంగ మంత్రిత్వ శాఖ సైతం పాస్‌పోర్ట్ అనేది కేవలం ఒక ప్రయాణ పత్రం మాత్రమేనని స్పష్టం చేయడం ఈ చర్చను మరింత తీవ్రతరం చేసింది. మరి ఇన్ని పత్రాలు ఉన్న సామాన్యుడు తాను భారతీయుడిని అని నిరూపించుకోవడానికి ఎక్కడికి వెళ్లాలి? అసలు పౌరసత్వ నిరూపణకు ప్రత్యేకంగా ఒక పత్రం ఉండాలా? అనేది దేశంలోని ప్రతి పౌరుడిని తెలిచివేస్తున్న ప్రశ్న.



మనం నిత్యం ఉపయోగించే ప్రతి ప్రభుత్వ పత్రానికి రాజ్యాంగం, చట్టాల పరిధిలో నిర్దేశిత పరిమితులు ఉన్నాయి. ఓటర్ ఐడీ ... ఇది ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం కేవలం ఓటు వేసే హక్కును, నివాసాన్ని మాత్రమే ధృవీకరిస్తుంది. ఇకపోతే ఆధార్ కార్డ్... ఇది కేవలం ఒక వ్యక్తి గుర్తింపు, నివాస చిరునామా మాత్రమే. ఇది పౌరసత్వానికి నిరూపణ కాదని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ చట్టంలోనే స్పష్టంగా పేర్కొన్నారు. అలాగే సుప్రీంకోర్టు సైతం తన పలు తీర్పుల్లో దీనిని పౌరసత్వ పత్రంగా అంగీకరించబోమని తేల్చిచెప్పింది.
పాన్ కార్డ్ ... ఇది కేవలం ఆదాయపు పన్ను శాఖ పన్నుల వసూళ్లు, ఆర్థిక లావాదేవీల ట్రాకింగ్ కోసం ఇచ్చే పది అంకెల గుర్తింపు సంఖ్య మాత్రమే. పాస్‌పోర్ట్ .... విదేశాలకు వెళ్లేందుకు కేంద్రం జారీ చేసే ఈ పత్రం పౌరసత్వానికి బలమైన ఆధారంగా భావించినప్పటికీ, సాంకేతికంగా ఇది ఒక ప్రయాణ పత్రమేనని, పౌరసత్వ వివాదాలు వచ్చినప్పుడు దీనిని మాత్రమే తుది సాక్ష్యంగా తీసుకోలేమని చట్టాలు చెబుతున్నాయి.

సాంకేతికంగా ఒక వ్యక్తి భారత పౌరుడా కాదా అనేది తేల్చడానికి భారత పౌరసత్వ చట్టం 1955 అత్యంత కీలకం. ఈ చట్టం ప్రకారం పౌరసత్వాన్ని ప్రధానంగా మూడు రకాలుగా గుర్తిస్తారు. జనవరి 26, 1950 నుంచి జూలై 1, 1987 మధ్య భారతదేశంలో పుట్టిన ప్రతి ఒక్కరూ సహజంగానే భారత పౌరులు. జూలై 1, 1987 తర్వాత పుట్టిన వారైతే, వారు పుట్టిన సమయానికి తల్లి లేదా తండ్రిలో ఎవరో ఒకరు ఖచ్చితంగా భారత పౌరులై ఉండాలి. డిసెంబర్ 3, 2004 తర్వాత పుట్టిన వారైతే తల్లిదండ్రులు ఇద్దరూ భారత పౌరులై ఉండాలి లేదా ఒకరు పౌరుడై ఉండి, మరొకరు అక్రమ వలసదారు కాకూడదు. అంటే, ఒక వ్యక్తి పౌరసత్వాన్ని నిరూపించాల్సింది కేవలం ప్రస్తుత గుర్తింపు కార్డులు కావు, వారి పుట్టుక, వారి తల్లిదండ్రుల పుట్టుకకు సంబంధించిన చట్టపరమైన ఆధారాలు మాత్రమే పౌరసత్వాన్ని నిర్ణయిస్తాయి. పౌరసత్వ నిరూపణ పత్రాల వివాదం కేవలం సిద్ధాంత పరమైనది కాదు, అది ప్రాక్టికల్ సమస్య. అస్సాంలో చేపట్టిన నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ ప్రక్రియే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. అక్కడ లక్షలాది మంది సామాన్యుల వద్ద ఓటర్ కార్డులు, ఆధార్ వంటి పత్రాలు ఉన్నప్పటికీ.. వారు 1971 మార్చి 24 కంటే ముందు నుంచే తాము లేదా తమ పూర్వీకులు భారతదేశంలో నివసిస్తున్నట్లు లెగసీ డేటా లేదా బర్త్ సర్టిఫికెట్లు చూపించలేక కాలానుగుణంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ చారిత్రాత్మక పరిణామాలే రేపు దేశవ్యాప్తంగా ఎన్ఆర్సీ వస్తే సామాన్య పౌరుడు తన పౌరసత్వాన్ని నిరూపించుకోవడానికి ఎలాంటి పత్రాలు చూపించాలనే ఆందోళనను రేకెత్తిస్తున్నాయి.

ప్రస్తుత గందరగోళానికి తెరపడాలంటే దేశంలో ప్రతి ఒక్కరికీ ప్రత్యేకంగా ఒక పౌరసత్వ గుర్తింపు పత్రం ఉండాలా అనే ప్రశ్న ఇప్పుడు న్యాయ, సామాజిక వర్గాల్లో తలెత్తుతోంది. అమెరికా, యూరప్ వంటి అభివృద్ధి చెందిన దేశాలలో సిటిజన్‌షిప్ సర్టిఫికెట్ లేదా స్పష్టమైన పౌరసత్వ చట్టబద్ధత కలిగిన పత్రాలు ఉంటాయి. భారతదేశంలో కూడా ఆధార్ లేదా ఓటర్ ఐడీలను కేవలం ఒక విభాగంగా కాకుండా, వాటిలో పౌరసత్వ హోదాను చట్టబద్ధంగా ధృవీకరించేలా మార్పులు చేయాలి. లేదా నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ ద్వారా దేశంలోని చట్టబద్ధమైన పౌరులందరికీ ఒకే ఒక తిరుగులేని పౌరసత్వ కార్డును జారీ చేసే ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేయాల్సిన అవసరం ఉందన్న చర్చ ప్రస్తుతం జోరందుకుంది. ఒకవేళ భవిష్యత్తులో ఎవరికైనా పౌరసత్వానికి సంబంధించిన చట్టపరమైన సవాల్ లేదా నోటీసు ఎదురైతే, వారు ప్రస్తుత డిజిటల్ కార్డుల కంటే కూడా తమ పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం, తమ తల్లిదండ్రుల పుట్టుక లేదా విద్యా అర్హతల పత్రాలు, పాత రెవెన్యూ రికార్డులను భద్రపరుచుకోవడమే ఏకైక మార్గం.

ఓటు వేయడానికి, పన్నులు కట్టడానికి, దేశ సరిహద్దులు దాటడానికి ప్రభుత్వమే అధికారికంగా పత్రాలను జారీ చేసి తీరా పౌరసత్వం విషయానికి వచ్చేసరికి ఇవేవీ సరిపోవు.. మీ పూర్వీకుల పత్రాలు చూపించండి అనడం సామాన్య నిరక్షరాస్యులకు, గిరిజనులకు, వలస కూలీలకు పెద్ద శాపంగా మారుతుంది. అందువల్ల, భవిష్యత్తులో డిజిటల్ ఇండియా వేదికగా ప్రభుత్వం జారీ చేసే పాస్‌పోర్ట్ లేదా ఓటర్ ఐడీలనే పౌరసత్వానికి కూడా ప్రాథమిక సాక్ష్యాలుగా గుర్తించేలా చట్టాల్లో తగిన సవరణలు తీసుకురావడమే ఈ దేశవ్యాప్త గందరగోళానికి శాశ్వత పరిష్కారమన్నది ఎక్కువ మంది భావన. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికిప్పుడు చట్టం తీసుకు వస్తుందా లేక ప్రస్తుతం ఉన్న చట్టంలో మార్పులు తెస్తుందా అనేది పక్కన పెడితే సామాన్య పౌరులకు తక్షణమే ఎదురయ్యే ఇబ్బందిని దూరం చేయాల్సిన అవసరమైతే ఉంది. అదే విధంగా రోజుకో పాలసీ, పూటకో విధానం అనుసరించకుండా సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం కూడా ఉంది. అధునాతన సమాజంలో వలసలు పెరిగాయి, ఉపాధి కోసం పల్లెలను విడిచి పట్టణాలు, పట్టణాలను విడిచి దేశాలకు వెళ్ళిన వారున్నారు. వారందరికి ఎదురయ్యే సమస్యకు పరిష్కారం కూడా చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



-గడ్డం కృష్ణమూర్తి
అసోసియేట్ ఎడిటర్, మహా పత్రిక

# సమాచార హక్కు చట్టానికి తూట్లు

అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా వర్ధిల్లుతున్న భారతదేశంలో సమాచార హక్కు చట్టం 2005 అమలులోకి రావడం వెనకాల మేధావుల సైద్ధాంతికత దార్శనికతలు, స్వచ్ఛంద సంస్థల జనజాగృతులు మరియు ప్రజల వీరోచిత పోరాటోద్యమాల నిర్విరామ కృషి ఎంతగానో ఉంది. పరిపాలనలో పారదర్శకతకు పెద్ద పీట వేయడం, ప్రభుత్వ శాఖల్లో అవినీతిని అరికట్టడం, ప్రభుత్వ సంస్థలు ప్రజలకు జవాబుదారీగా పనిచేయడం...అంతిమంగా ప్రజలకు సుపరిపాలన అందించే లక్ష్యాలను సాధించే దిశగా రూపొందింపబడి అమలు కాబడుతున్న సమాచార హక్కు చట్టం పాలకుల అసమర్థత కారణంగా నేడు అనేక సవరణలకు లోనై ఆ చట్ట ఉనికి ప్రశ్నార్థకం కాబడుతుండడం విచారకరం. యు.పి.ఏ ప్రభుత్వం 2005 లో అమలులోకి తీసుకువచ్చిన ఈ సమాచార హక్కు చట్టానికి 2018 లో ఎన్.డి.ఎ ప్రభుత్వం అనేక సవరణలు చేసి అసలు ఆ చట్టానికి కోరలు పీకివేసింది. తాజాగా మహారాష్ట్ర ప్రభుత్వం సమాచార హక్కు చట్టం 2005 నాటి నిబంధనలకు సవరణలు చేసింది. 2026, జూన్ 12 నాడు గెజిట్ నోటిఫికేషన్ లో వెలువరించబడి జూలై 5 నుండి అమలులోకి రానున్న ఈ కొత్త సవరణలు సమాచార హక్కు చట్టానికి తూట్లు పొడిచే విధంగా ఉన్నాయి. మహారాష్ట్ర ప్రభుత్వం సమాచార హక్కు చట్టానికి చేసిన ఈ చట్ట విరుద్ధమైన సవరణలు చేయడం మూలంగా ప్రజలు సమాచారాన్ని పొందకుండా నిరోధించడమే కాకుండా పారదర్శకతకు ప్రతిబంధకంగా మారనున్నాయి. ఈ సవరణలు సామాన్యుల నుండి సామాజిక కార్యకర్తల దాకా సర్వత్రా పెద్ద ఎత్తున విమర్శలను ఎదుర్కొంటూనే ఉన్నాయి. 'ప్రజలకు సమాచార హక్కు చట్టాన్ని దూరం చేసే దురుద్దేశ్యాలతోనే మహారాష్ట్ర ప్రభుత్వం ఈ సవరణలు చేసింది' అని చాలా స్పష్టంగా అర్థమవుతూనే ఉంది. మొత్తంగా సమాచార హక్కు చట్టాన్ని బలహీనపరిచే దిశగా మహారాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకోవడం అసహేతుకం. ఈ సంకట పరిస్థితులలో సమాచార హక్కు అమలు కోసం మహారాష్ట్రలో 1998 నుంచి అనేక ఆందోళనలలో పాల్గొన్న ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారే మహారాష్ట్ర ప్రభుత్వం చేసిన ఈ సవరణలపై తీవ్రంగా ప్రతిఘటించారు. ఒకవేళ మహారాష్ట్ర ప్రభుత్వం ఈ సవరణలను ఉపసంహరించుకోకపోతే రాలేగావ్ సిద్ధి గ్రామంలో జూలై 5 నుంచి తాను ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌కు రాసిన లేఖ ద్వారా ఆయన ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం పౌరులు సమాచారం కోరడానికి గల కారణాలను సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 6(2) ప్రకారం దరఖాస్తుదారులు తమ వ్యక్తిగత వివరాలను మరియు సమాచారం కోరడానికి గల కారణాలను వెల్లడించాల్సిన అవసరం ఎంతమాత్రం లేకున్ననూ సమాచారం కోరే ఉద్దేశ్యాన్ని దరఖాస్తుదారులు తప్పనిసరిగా పేర్కొనాలని కోరుతూ మహారాష్ట్ర ప్రభుత్వం జూన్ 12 నాడు వెలువరించిన సవరణలలో పేర్కొంది. కాని ప్రజానీకం నుండి తీవ్ర విమర్శలు వెలువెత్తడంతో మహారాష్ట్ర ప్రభుత్వం జూన్ 19 నాడు 'దరఖాస్తుదారులు ఉద్దేశ్యాన్ని వెల్లడించాలి' అనే ఈ ఒక్క సవరణను మాత్రమే తొలగించడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. ఇతర సవరణలలో దరఖాస్తు మరియు అప్పీల్ రుసుములకు సంబంధించిన అనేక మార్పులు ఉన్నాయి. 20 సంవత్సరాల తర్వాత దరఖాస్తు రుసుమును రూపాయలు 10 నుండి రూపాయలు 30 కి పెంచడం, పత్రాల ఫోటోకాపీల రుసుమును పేజీకి రూపాయలు 2 నుండి రూపాయలు 5 కి పెంచడం ఏ రకంగానూ సహేతుకం కానేకాదు. 'ఒక అంశానికి సంబంధించి ఒకే దరఖాస్తు' అనే నిబంధన మూలంగా దరఖాస్తుదారులు ఒకే దరఖాస్తులో బహుళ సమాచార అంశాలను చేర్చకుండా నిరోధిస్తుంది. ఫలితంగా దరఖాస్తుదారులకు ఆర్థిక సమస్యలు తలెత్తుతాయి. ఏ రకంగా చూసినా ఈ నిబంధన ఏమాత్రం సహేతుకం కానేకాదు. అంతేకాకుండా ఒక దరఖాస్తుకు 150 పదాల పరిమితిని విధించడం అర్థరహితం. సమాచార కమిషన్ విచారణల సమయంలో న్యాయ ప్రాతినిధ్యంపై నిషేధం, విచారణకు దరఖాస్తుదారు హాజరు కాకపోతే ఆ కేసులను లేదా అప్పీళ్లను కొట్టివేయడం, ఒక దరఖాస్తుదారు మరణిస్తే వారి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తు లేదా అప్పీల్ లను మూసివేయడం, సమాచార కమిషన్ ముందు విచారణల సమయంలో న్యాయసహాయాన్ని నిరాకరించడం మరియు పునరావృత దరఖాస్తులపై నిషేధం మొదలైన సవరణలు మొత్తంగా పౌరుల సమాచార హక్కును హరించే విధంగా ఉన్నాయి. అరకొరగా అమలు అవుతున్న సమాచార హక్కు చట్టం నేడు ఈ అసహేతుక సవరణల మూలంగా అసలు ఈ సమాచార హక్కు లక్ష్యాలు నెరవేరకపోగా ప్రజానీకం మరియు సమాచార హక్కు కార్యకర్తలు మరిన్ని సమస్యల వలయంలో సమిధలు కానున్నారు. ఈ సవరణల మూలంగా సమాచార అధికారులు జవాబుదారీతనం నుండి తప్పించుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అంతిమంగా 'పౌరుల సమాచార హక్కును నిర్వీర్యం చేసేందుకు ఈ సవరణలు రూపొందించారు' అనే అనుమానాలు స్పష్టంగానే వ్యక్తం అవుతున్నాయి. అందువలన ఈ సమాచార హక్కు చట్టం సవరణలను ఉపసంహరించుకునేంత వరకు ప్రజానీకం ముక్తకంఠంతో ప్రతిఘటించాల్సిన అవసరం తప్పకుండా ఉంది.







- జె.జె.సి.పి. బాబూరావు
రీసెర్చ్ స్కాలర్, 94933 19690

# మౌనమనే మహాకావ్యం

## పీవీ నరసింహారావు

చరిత్రలో కొందరు నాయకులు ఒక కాలానికి ప్రతినిధులుగా నిలుస్తారు... మరికొందరు కాలగతినే మార్చి దార్శనికులుగా నిలిచిపోతారు. అలాంటి అరుదైన మహనీయుల్లో మాజీ ప్రధాని, భారతరత్న పాములపర్తి వెంకట నరసింహారావు ఒకరు. తెలంగాణ మట్టిలో జన్మించి, భారత రాజకీయాలు, ఆర్థిక విధానాలు, దౌత్య రంగానికి కొత్త దిశానిర్దేశం చేసిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది.

తెలంగాణ గడ్డపై జన్మించిన ఈ మౌనముని, భారత రాజకీయాల్లో ఓ విశిష్ట అధ్యాయాన్ని లిఖించారు. పదవుల కోసం రాజకీయాలు చేయలేదు... బాధ్యతల కోసం పదవులను స్వీకరించారు. మాటల ఆర్భాటం కన్నా నిర్ణయాల ప్రభావాన్ని విశ్వసించారు. అందుకే పీవీని అర్థం చేసుకోవాలంటే ఆయన చేసిన ప్రసంగాలను కాదు, దేశ భవిష్యత్తును మార్చిన ఆయన నిర్ణయాలను చదవాలి. సంక్షోభంలో అవకాశాన్ని చూసిన దార్శనికుడు, మౌనంలోనే మార్పు సృష్టించిన మహానాయకుడు పీవీ నరసింహారావు.
సంక్షోభం ఒక దేశాన్ని పరీక్షిస్తుంది. నాయకత్వం ఒక నాయకుడిని పరీక్షిస్తుంది. 1991లో భారతదేశం అలాంటి చరిత్రాత్మక పరీక్షను ఎదుర్కొంది. విదేశీ మారక నిల్వలు కరిగిపోయాయి. ఆర్థిక వ్యవస్థ ఊపిరాడక సతమతమైంది. ప్రపంచం భారత్ వైపు సందేహంతో చూసిన వేళ, పీవీ మాత్రం భవిష్యత్తును ధైర్యంగా చూశారు. అలజడిలో అవకాశాన్ని వెతికారు. ఆర్థిక సంస్కరణల ద్వారానే దేశాన్ని గట్టెక్కించగలమని విశ్వసించారు. అదే విశ్వాసం నేటి భారత ఆర్థిక శక్తికి పునాదిగా నిలిచింది.



పీవీ వ్యక్తిత్వంలో రాజకీయ నాయకుడికంటే ముందు ఒక మేధావి కనిపిస్తాడు. అధికారాన్ని ఆస్వాదించడం కంటే ఆలోచనలను ఆస్వాదించిన మనిషి ఆయన. పుస్తకాలను ప్రేమించినంతగా ప్రజలను ప్రేమించారు. భాషలను నేర్చుకున్నంతగా సంస్కృతులను అర్థం చేసుకున్నారు. తెలుగు నుంచి స్పానిష్ వరకు, సంస్కృతం నుంచి ఫ్రెంచ్ వరకు భాషలతో ఆయనకు ఉన్న అనుబంధం, ఆయన విజ్ఞాన విశాలతకు అద్దం పడుతుంది.

పీవీ ఓ నాయకుడు మాత్రమే కాదు మేధస్సుకు చిరునామా. ఒక ప్రాంతం ప్రపంచానికి అందించిన ఆలోచనా సంపద. మట్టి ఎంత సాధారణమైనదైనా, అందులో పుడే విత్తనం అసాధారణమైతే చరిత్ర మారుతుందని ఆయన నిరూపించారు.
విచిత్రమేమిటంటే... జీవితకాలంలో విమర్శలను ఎదుర్కొన్న పీవీ, మరణానంతరం ప్రశంసలను అందుకున్నారు. కాలమే ఆయన గొప్పతనానికి న్యాయనిర్ణేత అయింది. ఒకప్పుడు వివాదాల కళ్ల జోడుతో చూసిన నాయకుడిని, నేడు భారత ఆర్థిక సంస్కరణల పితామహుడిగా దేశం గౌరవిస్తోంది. ఆలస్యమైనా భారతరత్న ఆయనను వరించింది. అది ఒక వ్యక్తికి లభించిన పురస్కారం మాత్రమే కాదు దూరదృష్టికి, మౌన నాయకత్వానికి, మేధస్సుకు లభించిన జాతీయ గౌరవం.

గతానికి భిన్నంగా తెలంగాణలో పీవీ వారసత్వంపై కొత్త చర్చ జరుగుతోంది. తెలంగాణ గర్వకారణంగా ఆయనను నిలబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇది వ్యక్తి ఆరాధన కాదు విలువలకు ఇచ్చే గౌరవం. మహానుభావులను రాజకీయ కోణంలో చూడటం కన్నా, వారి ఆలోచనలను భావితరాలకు అందించడం గొప్ప బాధ్యత. పీవీ వారసత్వం కూడా అలాంటిదే.

పీవీ నరసింహారావు జీవితం చెప్పే సందేశం ఒక్కటే... గొప్ప నాయకత్వం అంటే ప్రచారం కాదు, ప్రజా ప్రయోజనం. అధికారం అంటే హోదా కాదు, బాధ్యత. సంస్కరణ అంటే ప్రశంసల కోసం తీసుకునే నిర్ణయం కాదు దేశ భవిష్యత్తు కోసం విమర్శలను సైతం భరించే ధైర్యం. దేశభక్తి అంటే నినాదాల్లో కాదు... జాతి ప్రయోజనాలను కాపాడే కార్యాచరణలో కనిపించాలి. ఆ విలువలను తన రాజకీయ జీవితమంతా ఆచరణలో చూపిన నాయకుడు పీవీ నరసింహారావు. కాలం మారుతుంది... పాలకులు మారుతారు... రాజకీయ పరిస్థితులు మారిపోతాయి. కానీ జాతి భవిష్యత్తుకు పునాదిగా నిలిచిన నిర్ణయాలు, వాటిని తీసుకున్న నాయకత్వం చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాయి. భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి పోసి, ప్రపంచ వేదికపై దేశ ప్రతిష్ఠను పెంచిన పీవీ నరసింహారావు అలాంటి మహానేత. తెలంగాణ మట్టిలో జన్మించిన ఆ మహామేధావి ఒక ప్రాంతానికో, ఒక పార్టీకో పరిమితమైన నాయకుడు కాదు... దేశానికే దిక్సూచి. ఆయన జయంతి దూరదృష్టి, మేధస్సు, పరిపాలనా సామర్థ్యం, సంస్కరణల స్ఫూర్తిని పునరుద్ఘాటించే సందర్భం. మౌనాన్ని శక్తిగా, పరిపాలనను ప్రజాసేవగా, నాయకత్వాన్ని చరిత్రగా మలిచిన భారతరత్న పీవీ నరసింహారావుకు అదే నిజమైన ఘన నివాళి.



-అమరవాజీ నాగరాజు
టీపీసీసీ చీఫ్ పీఆర్ఓ



## అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలి

- ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్లు అప్రమత్తంగా ఉండాలి
- మాజీ ఉప మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్

**కుషాయిగూడ, మహా** : మహా అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ అన్నారు శనివారం జవహర్ నగర్ 543, 544, 545లో గల బూతులలో ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటరు సవరణ ప్రక్రియ ముగిసే వరకు అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కల్పించుకోవాలని ఆయన తెలిపారు. ప్రతి బిఎల్ ఓ రోజుకు ఒక బూత్ పరిధిలో 50 ఇండ్లను సందర్శించి ఓటర్లకు వివరాల పత్రాలను అందజేస్తారని ఆయన తెలిపారు. ఓటర్లు తమ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఓటర్లను నమోదు చేసుకోవాలని బిఎల్ఓ లకు పత్రాలను అందజేయాలని ఆయన తెలిపారు. బిఎల్ ఓ లు సర్వేకు వచ్చిన సమయంలో ఇంట్లో ఎవరు అందుబాటులో లేకపోతే జాబితాలో సదరు ఓటరు పేరును పక్కన మార్కు చేస్తారని అలాంటి వారు ఆందోళన చెందకుండా ఆగస్టు నెలలో ఆన్ లైన్ ద్వారా కానీ లేదా నేరుగా తహసిల్దార్ కార్యాలయంలో ఫామ్ 8 ద్వారా తమ ఓటు హక్కును భద్రపరచుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు బిఎల్ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతి పై ప్రత్యేక అధికారి సమీక్ష

**సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు**




**మహా వరంగల్ బ్యూరో;** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12, 2026 వరకు గ్రామ, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని సమీక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ నేపథ్యంలో వరంగల్ జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమితులైన బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ & ముఖ్య కార్యదర్శి బి. బాలా మాయా దేవి, ఐఏఎస్ శనివారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేసిన 10 థీమ్ లకు సంబంధించిన అంశాల పై ప్రత్యేకంగా రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంబంధిత శాఖల అధికారులు వివరాలను సమర్పించారు. వివిధ శాఖల వారీగా సాధించిన పురోగతి, లక్ష్యాల సాధన, ఎదురవుతున్న సమస్యలు, చేపట్టాల్సిన చర్యలపై జిల్లా ప్రత్యేక అధికారి సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక అధికారి బి. బాలా మాయా దేవి మాట్లాడుతూ, ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక ఒక నిరంతర ప్రక్రియ అని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను సాధించినందుకు జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందించేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేసి వరంగల్ జిల్లాను అభివృద్ధి లో ముందుకు తీసుకు వెళ్లాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని, ప్రజలకు ప్రభుత్వ పథకాల ఫలాలు వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, జడ్పీ సీఈవో రాంరెడ్డి,ఆర్డీవోలు వరంగల్ సుమ,నర్సంపేట ఉమారాణి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.



### జిల్లా బిజెపి (ఓబీసీ) రూరల్ అధ్యక్షులుగా మహేందర్ యాదవ్ ఎన్నిక

**కుషాయిగూడ, మహా :** బిజెపి మేడ్చల్ రూరల్ జిల్లా ఓబీసీ అధ్యక్షులుగా రెండవసారి ఎర్రడాల మహేందర్ యాదవ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు మేడ్చల్ రూరల్ జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు గా ఎన్నికైన మహేందర్ యాదవ్ ను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా మహేందర్ యాదవ్ మాట్లాడుతూ జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా రెండవసారి అవకాశం ఇచ్చిన బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులకు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధముల ఆనంద్ గౌడ్ కు, జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ కు సహకరించిన స్థానిక బిజెపి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.




## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తా

- తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు
- హిమాయత్ నగర్ 60 గజాల బాధితులకు సంఘీభావం తెలిపిన బక్కని నరసింహులు

**మొయినాబాద్ మహా:** ఎన్నో ఏళ్ల నుంచి పోరాటం చేస్తున్న హిమాయత్ నగర్ 60 గజాల స్థలాల బాధితులకు అండగా ఉంటానని వారి సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఇళ్ల స్థలాలు ఇప్పించే బాధ్యత తనదేనని తెలంగాణ తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు పేర్కొన్నారు. గతంలో తమకు కేటాయించిన స్థలంలో ఇల్లు నిర్మించుకుంటామని ఆందోళన చేపడుతున్న హిమాయత్ నగర్ గ్రామస్థులకు ఆయన శనివారం సంఘీభావం తెలిపి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హిమాయత్ నగర్ గ్రామస్తులకు అండగా ఉంటుందని చెప్పారు. గతంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను ఇప్పుడు లాక్కోవడం సరికాదని..బాధితులు ఇల్లు నిర్మించుకునేంతవరకు వారికి అండగా ఉంటామని భరోసాని ఇచ్చారు. గ్రామస్తులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కులను సంపాదించుకోవాలని తెలిపారు. గతంలో ఎందరో మహానుమూర్తులు పేదల కోసం అనేక ఎకరాల భూములను త్యాగం చేశారని ఇప్పుడు అవి ఎక్కడికి వెళ్లాయో తెలియదన్నారు. పేదల పక్షాన తెలుగుదేశం పార్టీ పోరాటం చేస్తూనే ఉంటుందని భరోసాని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు, హిమాయత్ నగర్ గ్రామస్థులు, యువజన సంఘాల నాయకులు ఉన్నారు.

### స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలి

**ఏలే చంద్రశేఖర్**
**బిజెపి రాష్ట్ర కమిటీ సభ్యులు**

**వలిగొండ జూన్ 27 మహా** న్యూస్ ఎన్నికల కమిషన్ ఏర్పాటుచేసిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ నమోదు పరిశీలన కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలని బిజెపి రాష్ట్ర కమిటీ సభ్యులు ఏలే చంద్రశేఖర్ అన్నారు శనివారం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో బచ్చ శ్రీనివాస్ మైసొల్ల మచ్చగిరి గంగాధరి దయాకర్ దంతూరి అరుణ్ నారి లింగస్వామి జంగయ్య మహేష్ వెంకటేశం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు



## కూలీలకు ఉపాధి పనులు కల్పించాలి

- సిర్పంగి స్వామి

**వలిగొండ జూన్ 27 మహా న్యూస్** సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ఎలాంటి పనులు లేకుండా ఖాళీగా ఉంటున్న కూలీలకు ఉపాధి హామీ పథకం కింద వెంటనే పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు శనివారం పులిగిల్ల గ్రామంలో దళితవాడల సర్వే సమస్యలపై పోరుబాట అనే కార్యక్రమంను చేపట్టారు ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిర్పంగి స్వామి మాట్లాడుతూ వర్షాలు లేక వ్యవసాయ కూలీలకు ఏలాంటి పనులు దొరకడం లేదని దీంతో వారు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని వెంటనే పులిగిల్ల గ్రామం తో పాటు మండల వ్యాప్తంగా అనేక గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దొడ్డి బిక్షపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు, కెవిపిఎస్ మండల అధ్యక్షుడు వేముల అమరేందర్, నాయకులు దొడ్డి యాదగిరి, లక్ష్మణ్, శివమణి,లక్ష్మమ్మ,యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు



### అగ్రిమెంట్ ముగిసిన దుకాణాలకు సీజ్

**రాజేంద్రనగర్, మహా:** శంషాబాద్ బస్టాండ్‌లో అగ్రిమెంట్ గడువు ముగిసినా ఖాళీ చేయని 14 వాణిజ్య సముదాయాలను (దుకాణాలు) రాజేంద్రనగర్ డిపో మేనేజర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శేఖర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.డిపో మేనేజర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) శంషాబాద్ బస్టాండ్‌లోని 14 వాణిజ్య సముదాయాలు 2005లో నిర్వహించిన వేలంపాటలో నెలకు సుమారు రూ.2,000 అద్దె చెల్లించే షరతులతో కేటాయించబడినట్లు తెలిపారు. ఆయా దుకాణాల అగ్రిమెంట్ గడువు 20 సంవత్సరాలు కాగా, ప్రస్తుతం 21 సంవత్సరాలు మూడు నెలలు పూర్తయ్యాయని చెప్పారు.అగ్రిమెంట్ ముగిసి ఏడాదికి పైగా గడిచినా దుకాణాలను ఖాళీ చేయకపోవడంతో పలుమార్లు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ స్పందన లేకపోవడంతో శనివారం సంబంధిత అధికారులతో కలిసి పోలీసుల బందోబస్తు మధ్య 14 దుకాణాలకు సీజ్ బోర్డులు ఏర్పాటు చేసి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.



### పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచాలి

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాశాఖ అధికారి పి చంద్రయ్య**

**మంచిర్యాల, మహా:** అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాశాఖ అధికారి పి చంద్రయ్య ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అన్ని మండలాల విద్యాశాఖ అధికారులు, ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాళ్ళు, యు ఆర్ ఎస్ టి జి ఆర్ ఐ ఈ, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పాఠశాల నుంచి అడ్మిషన్లను నమోదు చేయాలని, ఉపాధ్యాయులు, విద్యార్థుల ఎఫ్ ఆర్ ఎస్ హాజరు 100 శాతం నమోదు ఉండాలని, ప్రభుత్వ పాఠశాలలలో వసతులు పెరిగినందున విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసి పాఠశాలలో నమోదు సంఖ్యను పెంపొందించాలని తెలిపారు. పాఠశాలలలో నమోదైన ప్రతి విద్యార్థికి అపార్ జనరేట్ చేయాలని, ప్రతి విద్యార్థికి ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందించామని, త్వరలోనే 2 జతల యూనిఫామ్స్ అందించడం జరుగుతుందని తెలిపారు. మండల విద్యాధికారులు ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేయాలని, జీరో ఎన్రోల్మెంట్ పాఠశాలలు 4 పున: ప్రారంభించామని, ప్రీ ప్రైమరీ పాఠశాలలకు త్వరలోనే ఇన్స్ పేక్టర్లను నియమిస్తామని వెల్లడించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో 100 శాతం నమోదు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. విద్యార్థులను యుడైస్ ప్లస్ లో నమోదు చేయాలని, ప్రభుత్వం విద్యారంగంలో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని, ఉన్నత చదువులు అభ్యసించేలా విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అదనపు సంచాలకులు లలిత, సెక్టోరియల్ అధికారులు ఎం.భరత్ కుమార్, కె.కృష్ణమూర్తి, జై సత్తయ్య, కె విజయలక్ష్మి, ఏ రాజ్ కుమార్, అన్ని మండలాల విద్యాధికారులు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీపై యువజన కాంగ్రెస్ నాయకుల నిరసనలు

**కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మ దహనం.**




**రాజేంద్రనగర్ మహా:** నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనను నిరసిస్తూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో శంషాబాద్ ఎయిర్పోర్ట్ వెళ్లే ప్రధాన రహదారిలో జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు శనివారం ఆందోళనలు నిర్వహించారు. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నాగేందర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి కేంద్ర విద్యాశాఖ మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో పలు పోటీ పరీక్షల పేపర్ లీకేజీలు జరుగుతూనే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించాల్సిన నీట్ పరీక్ష కూడా లీకేజీకి కావడం దురదృష్టకరమన్నారు. పేపర్ లీకేజీ కారణంగా అనేక మంది విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. విద్యార్థుల, వారి తల్లిదండ్రుల జీవితాలతో ఆటలాడుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నటికీ క్షమించరని దుయ్యబట్టారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,యువజన కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## నీట్ పేపర్ లీకేజీపై యువజన కాంగ్రెస్ నాయకుల నిరసనలు..

- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మ దహనం....

**రాజేంద్రనగర్ మహా;** నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనను నిరసిస్తూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో శంషాబాద్ ఎయిర్పోర్ట్ వెళ్లే ప్రధాన రహదారిలో జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు శనివారం ఆందోళనలు నిర్వహించారు. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నాగేందర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి కేంద్ర విద్యాశాఖ మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో పలు పోటీ పరీక్షల పేపర్ లీకేజీలు జరుగుతూనే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించాల్సిన నీట్ పరీక్ష కూడా లీకేజీకి కావడం దురదృష్టకరమన్నారు. పేపర్ లీకేజీ కారణంగా అనేక మంది విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. విద్యార్థుల, వారి తల్లిదండ్రుల జీవితాలతో ఆటలాడుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నటికీ క్షమించరని దుయ్యబట్టారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,యువజన కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### లింగస్వామి దశదిన కార్యక్రమంలో పాల్గొన్న ఏలే చంద్రశేఖర్

**వలిగొండ జూన్ 27 మహా న్యూస్** మండల పరిధిలోని నెమలి కాల్వ గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ కార్యకర్త సారగండ్ల లింగస్వామి దశదిన కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏలే చంద్రశేఖర్ శనివారం హాజరై తమ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఆ కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.





## కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి

- వరంగల్ జిల్లా డిసిసి అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్

**మహా వరంగల్;** వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ పిలుపుమేరకు వరంగల్ పోచమ్మ మైదాన్ సెంటర్ లో చాత్రోంకి గూంజ్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం భారతదేశంలో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ ఏ పరీక్షలు చేపట్టిన పేపర్ లీక్ ల ద్వారా విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న కేంద్ర ప్రభుత్వం విధివిధానాలను వ్యతిరేకిస్తూ, మొన్న జరిగిన నీట్ ఎగ్జామ్ పేపర్ లీక్ పై ఎంతోమంది విద్యార్థుల జీవితాలను అందాకారంలోకి నెట్టేసిన కేంద్ర ప్రభుత్వాన్ని నిరసిస్తూ పోచమ్మ మైదాన్ జంక్షన్ లో నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అలాగే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాను కూడా రాజీనామా చేయాలని జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ అయూబ్ డిమాండ్ చేశారు. అదేవిధంగా యువత భవిష్యత్తుతో ఆడుకుంటున్న ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి అమిత్ షా లు కూడా వెంటనే రాజీనామా చేసి ప్రజలకు బేశెరత్తుగా విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని జిల్లా యువజన విభాగ అధ్యక్షులు కొరివి పరమేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నల్ల గొండ రమేష్, కరాటే ప్రభాకర్ గజ్జల లింగమూర్తి, జన్ను రవి తో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### దుర్గమ్మను మొక్కుకున్న బీర్ల అయిలయ్య

**యాదాద్రి భువనగిరి జూన్ 27 మహా** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని దుర్గమ్మ తల్లి ఆలయంలో నిర్వహిస్తున్న 11వ వార్షికోత్సవంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శనివారం రాత్రి పాల్గొని దుర్గమ్మకు మొక్కుకొని ప్రత్యేక పూజలు చేశారు ఈ సందర్భంగా ఆలేరు పట్టణ మున్సిపల్ చైర్మన్ బిజాన బలమణి భాస్కర్ తోపాటు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దుర్గమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, తెలంగాణలో ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా సమాజంలో ఐక్యత, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించే పవిత్ర క్షేత్రాలని పేర్కొన్నారు. వార్షికోత్సవం విజయవంతంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులను అభినందిస్తూ, భక్తులందరూ ప్రశాంత వాతావరణంలో ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.



## సీయంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రులు

- **కంది శ్రీనివాస రెడ్డి కార్యాయంలో కార్యక్రమం**

**ఆదిలాబాద్ మహా** : పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మంత్రులు జూపల్లి కృష్ణారావు, మహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య మంత్రి సహాయ నిధినుండి వచ్చిన చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేసారు. మొత్తం 15లక్షల 55వేల 5వందల విలువ గల 33 చెక్కులను అందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ,టీఎంఆర్ఈఐఎస్ చైర్మన్ ఫహీం ఖురేషి , టీజీఎంఎఫ్ సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ , ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ , అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి , మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి , ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మసంతోష్ రావు తదితరులు పాల్గొన్నారు.



## కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించిన మంత్రులు చైర్మన్ లు

**ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ పర్యటనకు విచ్చేసిన మంత్రులు జూపల్లి కృష్ణారావు,అజారుద్దీన్ , ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ , టీఎంఆర్ఈఐఎస్ చైర్మన్ ఫహీం ఖురేషి , టీజీఎంఎఫ్ సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ శనివారం పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. వారికి కంది శ్రీనివాస రెడ్డి పూల బొకేలు అందించి స్వాగతం పలికారు. శాలువాలతో సత్కరించారు.




## అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ ముఠా అరెస్ట్..

- **110 కిలో గంజాయి,**
- **రెండు కార్లు, 4 సెల్ ఫోన్లు స్వాధీనం...**

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ టాస్క్ ఫోర్స్ ఆదిబట్ల పోలీసుల సంయుక్తంగా చేసిన ఆపరేషన్ లో 110 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దిని విలువ సుమారురూ.56 లక్షలు ఉంటుందని శంషాబాద్ డీసీపీ తెలిపారు. డి సిపి కార్యాలయంలో డిసిపిరాజేష్ శనివారం మీడియాకు వివరాలను వెల్లడించారు. నలుగురు అంతర్రాష్ట్ర గంజాయి పెడ్లర్లు, 2 కార్లు, 4 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి మహారాష్ట్ర వయా హైదరాబాద్ మీదుగా స్మగ్లింగ్ కి టాటా హారియర్, మారుతి ఎర్టిగా వాహనాలను వినియోగిస్తున్నారు. ఒక వాహనం పైలట్ వాహనంగా ముందుండి పోలీస్ చెక్‌పోస్టుల సమాచారం ఇస్తూఎస్కార్ట్ గా పనిచేస్తుంది. టోల్ గేట్లకు చిక్కకుండా నకిలీ మహారాష్ట్ర నెంబర్ ప్లేట్లను ఏర్పాటు చేసుకుంటూ ఇంటర్నెట్ ద్వారా పోలీస్ నిఘాను తప్పించుకునే ప్రయత్నం చేస్తారు. బొంగులూరు ఓ ఆర్ ఆర్ గేట్ సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీలు చేయడంతో 110 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కిలో గంజాను 4 వేలకే కొనుగోలు చేసి, 20 వేల నుంచి 30 వేల వరకు విక్రయం చేస్తుంటారు. ప్రధాన సూత్రధారి ప్రణవ్ సింగ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. సరఫరాదారుడు ఒడిశా బెర్హాంపూర్‌కు చెందిన ప్రభిత్ర ప్రధాన్‌గా గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆదిభట్ల పోలీసులు తెలిపారు.

## దివ్యాంగుల నైబర్‌హుడ్ సెంటర్లకు ఆటో వాహనాల పంపిణి

**హైదరాబాద్/యాదాద్రి భువనగిరి జూన్ 27 మహా** : హెలెన్ కిల్లర్ జయంతి సందర్భంగా శనివారం దివ్యాంగుల సాధికారతను ప్రోత్సహించే ఉద్దేశంతో ఇండియన్ ఆయిల్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ వారి సహకారంతో దివ్యాంగుల నైబర్‌హుడ్ సెంటర్లకు ప్రత్యేక ఆటో వాహనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సితక్క,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్యఅతిథిగా హాజరై హైదరాబాద్ లోని ప్రగతి భవన్ లో వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క, ప్రభుత్వ బీర్ల ఐలయ్యలు మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, వారికి అవసరమైన సేవలను గ్రామస్థాయిలో అందించేందుకు నైబర్‌హుడ్ సెంటర్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ ఆటో వాహనాల ద్వారా దివ్యాంగులకు గ్రామస్థాయిలో సేవలను మరింత వేగంగా, సమర్థవంతంగా అందించే అవకాశం కలుగుతుందని అధికారులు పేర్కొన్నారు. ఇండియన్ ఆయిల్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ అందించిన సహకారాన్ని ఈ సందర్భంగా వక్తలు అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివ్య దేవరాజన్, జిల్లా ఓపీలు, మండల సమైక్య ఓపీలు, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.




# ఓట్ల విషయంలో జాగ్రత్త అవసరం

(మొదటి పేజీ తరువాయి )

లేకపోతె పెద్ద ఎత్తున ఓట్లు గల్లంతయ్యే ప్రమాదముందన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ మళ్ళీ అధికారంలోకి రావాలన్నా, దేశంలో రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్నా ఈ ప్రక్రియపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. పట్టణాలు గ్రామాలలో ఎన్యుమరేషన్ చేస్తున్న బీఎల్ వోలతో కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్లు సత్సంబంధాలు పెట్టుకోవాలని వారితో మర్యాదగా ఉంటూ రోజువారి వివరాలు తెలుసుకోవాలన్నారు. ఇంచార్జిలతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకొని రోజువారీ అప్‌డేట్ పంపించాలన్నారు. తొలగించిన ఓట్ల విషయంలో ఎందుకు తొలగించారో ఆరా తీయాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ లో 23 లక్షల పైచిలుకు ఓట్లకు గాను 18 లక్షల ఓట్లు మాత్రమే మ్యాపింగ్ లో ఉన్నాయన్నారు. ఇంకా 5 లక్షల పై చిలుకు ఓట్లు మ్యాపింగ్ కాలేదన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.ప్రతీ ఓటు ముఖ్యమేనని ఒక్క ఓటు కూడా పోకుండా అప్రమత్తంగా వ్యవహరంచాలన్నారు.బీఎల్వోలతో ఇంటింటికి తిరగాలన్నారు.ఈ నెల రోజులు విరామం లేకుండా పార్టీకోసం కష్టపడి పని చేయాలన్నారు.ఒక్కసారి ఓటు పోతే తిరిగి రావడం కష్టమన్నారు.బీహార్ వెస్ట్ బెంగాల్ ఎన్నికలలో పెద్ద ఎత్తున ఓట్లు తొలగించబడ్డాయన్నారు. అలాంటి పరిస్థితి రాష్ట్రంలో రాకూడదంటే మనమంతా అప్రమతతంగా ఉండాలన్నారు.స్థానికంగా లేనివారి ఓట్లు ఎక్కువగా గల్లంతయ్యేఅవకాశం ఉందని మనకు సంబంధించినవారు ఇతర ప్రదేశాలలో ఉంటే రప్పించి మ్యాపింగ్ చేయించాలన్నారు. ఆదిలాబాద్ లో అత్యధికంగా 44.04 శాతం మ్యాపింగ్ కాలేదని తెలిపారు.ఎన్యుమరేషన్ లో ఆమోదించినవి గైర్హాజరైన వివరాలు డైలీ అప్ డేట్ పంపాలన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పదవుల విషయంలో ఎలాంటి నిరాశ నిస్పృహ లకు లోనూ కావద్దన్నారు.సొసైటీ చైర్మన్ బాధ్యతలకు పేర్లు సూచించాలని త్వరలో భర్తీ చేద్దామన్నారు. అలాగే ఇక్కడి నాయకులు కోరినట్టుగా సీయంతో మాట్లాడేందుకు అప్పాయింట్ మెంట్ ఇప్పిస్తానన్నారు.మన పార్టీ గెలుపుకు మన ఓట్ బ్యాంక్ చాలా కీలకమని అందులోంచి ఒక్క ఓటు కూడా పోకుండా చూడాలన్నారు. పని చేయని ఏజెంట్ల స్థానంలో కొత్తవారిని నియమించి 100 శాతం పని చేసేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతీ ఒక్కరు ఈ నెల రోజులు పకడ్బందీగా పని చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం పై బీఆర్ఎస్ నాయకులు అబద్దపు ప్రచారాలు చేస్తున్నారని వాటిని సమర్ధవంతగా తిప్పికొట్టాలన్నారు.ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం ఎంతో ముందుందన్నారు. అమరుల త్యాగాల ఫలితంగా వచ్చిన తెలంగాణ ప్రజల ఆకాంక్షలకనుగుణంగా చేస్తారని గత టీఆర్ఎస్ కు ప్రజలు అవకాశమిస్తే ధనిక రాష్ట్రాన్నికాస్తా అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు.8వేల కోట్లు అప్పు చేసి ఆ భారాన్ని తమ ప్రభుత్వం పై వేసారన్నారు.దానికి వడ్డీ చెల్లిస్తూనే ప్రజా సంక్షేమ పథకాలకు నిధులు వెచ్చిస్తున్నామన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. రెండున్నర సంవత్సరాల కాలంలో ఇచ్చిన హామీలతో పాటు చెప్పనవి కూడా అమలు చేస్తున్నామన్నారు. ఇంకా అభివృద్ధి విషయంలో మీరు చెప్పే సుద్దులు తమకు అవసరం లేదని విపక్షాలకు చురకలంటించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ ..క్షేత్రస్థాయిలో బీఎల్ఏలు పని చెయ్యకపోతే ఓట్ల తొలగింపు పెద్ద ఎత్తున జరుగుతుందని తెలిపారు .ఖానా పూర్ నియోజక వర్గంలోను 40వేల ఓట్లు మ్యాపింగ్ కాలేదన్నారు.ఓట్ల తొలగింపు భవిష్యత్తు కు ప్రమాద హెచ్చరిక అని సూచించారు. దీనివలన ప్రభుత్వం పోయే ప్రమాదముందన్నారు.అందుకే ఓట్లు పోకుండా జాగ్రత్త వహించాలన్నారు. సెక్యులర్ పార్టీల ఓట్లు తొలగింపునకు బీజేపీ చూస్తోందని అందుకే జాగ్రత్తగా ఉండాలన్నారు.ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ..ప్రతి ఒక్కరూ బాధ్యతగా SIR ప్రక్రియలో బాధ్యతగా పాల్గొనాలన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 80వేల ఓట్లు మ్యాపంగ్ కాగ డేజర్ జోన్ లో ఉన్నాయన్నారు. అందులో ఎక్కువగా కాంగ్రెస్ అనుకూల ఓట్లే ఉన్నాయన్నారు, కేవలం పట్టణంలోనే 50వేల ఓట్లు ఇంకా మ్యాపింగ్ అవ్వలేదన్నారు. బూత్ ఏజెంట్లు సూపర్ వైజర్లు మండల అధ్యక్షులు జాగ్రత్తగా ఉండాలన్నారు. అర్హులు ఓట్లు గల్లంతు కాకుండా చూసుకోవాలన్నారు.పశ్చిమబెంగాల్ తమిళ నాడులో ముఖ్యమంత్రులు కూడా ఓడిపోవడానికి ఓట్ల తొలగింపే కారణమని ఆరోపించారు. మన నియోజక వర్గంలో అలాకాకుండా జాగ్రత్త పడాలన్నారు.ఓటరు నమోదు ప్రక్రియలో సూపర్‌వైజర్లు అలర్ట్‌గా ఉండాలన్నారు.SIR ప్రక్రియతో దేశంలో 6 కోట్ల ఓట్లు తొలగించారని ఇది మొత్తంలో 12శాతమని అన్నారు. బీఎల్వోల వెంట ఉండి ప్రక్రియ గమనించాలన్నారు.రోజువారి అప్ డేట్ క్యాంపు కార్యాలయ కంట్రోల్ రూం నంబర్ కు పంపాలన్నారు. తొలగించిన ఓట్లపై తమకు సమాచారం అందించాలని కోరారు. మన ఓట్లు కాపాడుకునే బాధ్యత మనందరి పై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు నరేష్‌జాదవ్ , నియోజకవర్గ అబ్జర్వర్ రమేష్,మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష,మాజీ పార్లమెంటు సభ్యులు సోయం బాపూరావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య నాయకులు సాజిద్ ఖాన్ ,గంద్రత్ సుజాత, అల్లూరి సంజీవరెడ్డి, అడ్డి బోజారెడ్డి ,అశ్విన్ రెడ్డి ,గోక గణేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు,.







## లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు

- **జీఎస్ ఎస్టేట్ కాలనీలో పనులు**
- **మరిన్ని నిధులతో శాశ్వత పరి-ష్కారం**
- **మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష**

**ఆదిలాబాద్ మహా**: వర్షాకాలం నేపథ్యంలో ఆదిలాబాద్ పట్టణంలోని అత్యంత వరద ప్రభావిత ప్రాంతమైన జీఎస్ ఎస్టేట్ కాలనీని శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సందర్శించారు. 5 లక్షల ప్రత్యేక నిధులతో చేపడుతున్న కాల్వల శుభ్రపరిచే పనులు, జేసీబీ ద్వారా డ్రైనేజీల క్లీనింగ్ కార్యక్రమాన్నిఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బండారి అనుషా సతీష్ మాట్లాడుతూ, అదిలాబాద్ పట్టణంలోని సుమారు ఆరు నుంచి ఏడు వార్డులు వరద ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించబడినట్లు తెలిపారు. మహాలక్ష్మి వాడ, పంజాబ్ చౌక్ నుంచి ప్రవహించే ప్రధాన నాలాలకు అనుసంధానంగా ఉన్న 8 నుంచి 9 కాలనీలను ప్రత్యేకంగా గుర్తించి, వాటిలో కాల్వలు శుభ్రపరిచే పనులు చేపడుతున్నామని తెలిపారు.ఈ పనుల కోసం 5 లక్షల ప్రత్యేక నిధులకు ఆమోదం పొందడంతో పనులు ప్రారంభమయ్యాయని, అలాగే భవిష్యత్తులో శాశ్వత పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో అవసరమైన నిధులు కేటాయించి ప్రధాన నాలాల అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.అదిలాబాద్ పట్టణంలో మురుగు కాల్వలు, డ్రైనేజీలు, రోడ్ల అభివృద్ధికి సంబంధించిన పలు పనులు ప్రస్తుతం టెండర్ దశలో ఉండగా, కొన్ని పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ పనులన్నీ పూర్తవడానికి కొంత సమయం పడుతుందని, అప్పటి వరకు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వరద ప్రభావిత ప్రాంతాల కోసం మున్సిపాలిటీలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, త్వరలో టోల్ ఫ్రీ నంబర్, ప్రత్యేక అధికారుల బృందాలతో ప్రతి కాలనీలో పర్యటించి ప్రజలకు అవసరమైన సహాయం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఆదిత్య కండేశ్కర్, ప్రభావతి, రాము, మున్సిపల్ అధికారులు, ఏఈలు, శానిటేషన్ సిబ్బంది, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## అర్హత కలిగిన దివ్యాంగులకు మాత్రమే సదరం ధ్రువపత్రాలు

- **పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్, సెర్ప్ సి.ఈ.ఓ. దివ్య దేవరాజన్**

**మంచిర్యాల, మహా :** అర్హత కలిగిన దివ్యాంగులకు మాత్రమే సదరం ధ్రువపత్రాలు మంజూరు చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్, సెర్ప్ సి.ఈ.ఓ. దివ్య దేవరాజన్ అన్నారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సదరం శిబిరాల నిర్వహణ, యు డి ఐ డి పోర్టల్ పార్ట్ బి వివరాల నమోదు, అటెండెన్స్ మార్కింగ్, దివ్యాంగుల హాజరు, పోర్టల్ లో వెయిటింగ్ లిస్ట్ ఉన్నవారికి వైద్య శిబిరం అసెస్మెంట్ షెడ్యూల్ కేటాయింపు అంశాలపై జిల్లా అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఈ.ఓ. మాట్లాడుతూ ప్రతి నెల నిర్వహించే సదరం యు డి ఐ డి శిబిరాలను పారదర్శకంగా నిర్వహించాలని, అర్హత కలిగిన దివ్యాంగులకు మాత్రమే ధ్రువపత్రాలు జారీ చేయాలని ఆయన సూచించారు. పెండింగ్ దరఖాస్తులు లేకుండా పరిష్కరించాలని, ప్రతినెలా తప్పనిసరిగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని అన్నారు. ప్రతి నెల మండలానికి ఒక గ్రామం చొప్పున దివ్యాంగుల గుర్తింపు, సదరం ధ్రువపత్రం లేని వారికి మీ సేవలో నమోదు, లోకో మోటర్, ఈ ఎన్ టి, కంటి శిబిరాల నిర్వహణ, బేరా, సౌండ్ ప్రూఫ్ పరికరాల లభ్యత, వినియోగం అంశాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య మాట్లాడుతూ మీసేవ ద్వారా సదరం శిబిరం కొరకు అందిన దరఖాస్తులను క్రమ సంఖ్య వారీగా పరిశీలించి అభ్యర్థులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, వైద్య పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ నియమ నిబంధనలను అమలు చేస్తున్నామని, వైద్య పరీక్షలు పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎం.ఓ. శ్రీధర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం :మంత్రులు జూపల్లి ,అజారుద్దీన్

- **20 కోట్లతో నిర్మించిన మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల భవనాన్ని ప్రారంభించిన మంత్రులు**
- **తరగతి వసతి గదుల పరిశీలన**
- **ప్రాంగణం లో మొక్కలు నాటిన మంత్రులు**

**ఆదిలాబాద్ మహా**: మైనార్టీ విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యతో పాటు ఆధునిక వసతులు కల్పించి, వారిని అన్ని రంగాల్లో పోటీతత్వానికి సిద్ధం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడలో రూ.20 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల-కళాశాల భవనాన్ని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నూతన భవనంలోని తరగతి గదులు, వసతి గదులు, భోజనశాల, ఇతర మౌలిక సదుపాయాలను మంత్రులు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అత్యాధునిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.మైనార్టీ విద్యార్థులు విద్యనే ఆయుధంగా మలుచుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. విద్యా రంగంలో సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్రంలోని మైనార్టీ విద్యాసంస్థలను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, మైనార్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన వసతి, ఆధునిక మౌలిక సదుపాయాలు, మెరుగైన బోధనా వాతావరణాన్ని అందిస్తోందని తెలిపారు. ఇలాంటి విద్యాసంస్థల ద్వారా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించే అవకాశాలు మరింత మెరుగుపడతాయని అన్నారు.అనంతరం కళాశాల ప్రాంగణంలో మంత్రులు మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు.



## దుర్గమ్మకు బోనం

**యాదాద్రి భువనగిరి జూన్ 27 మహా**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలోని శ్రీ కనకదుర్గమ్మ 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఆలేరు మున్సిపల్ చైర్ పర్సన్ బీజన బాలమణి భాస్కర్ అమ్మవారికి బోనం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.. ఈ సందర్భంగా బీజన బాలమణి భాస్కర్ మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో పిల్లాపాపలతో దుర్గమ్మ పండుగను జరుపుకోవాలని కోరారు. ఆలేరులో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలతో రైతులు సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నామన్నారు. ఆలేరు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుపుతామని ఆమె అన్నారు.

# బెంగళూరులో 130 ఏళ్ల ఇల్లు.. భలే మార్చిన ఐటీ దంపతులు

టెక్నాలజీ హబ్‌గా పేరొందిన బెంగళూరులో ఓ ఐటీ దంపతులు నిర్మించుకున్న ఇల్లు ఇప్పుడు సోషల్ మీడియాలో విశేష ఆకర్షణగా మారింది. అత్యాధునిక జీవనశైలికి అలవాటు పడిన ఈ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దంపతులు, తమ పూర్వీకుల జ్ఞాపకాలను ఆధునిక అవసరాలతో మేళవిస్తూ నిర్మించిన ఈ నివాసం నెటిజన్లను ఆకట్టుకుంటోంది. ఇంటికి సంబంధించిన వీడియోను డిజైన్ సంస్థ ఆర్చ్‌ప్రో (ArchPro) ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది.

అందులోని వివరాల ప్రకారం.. వేగవంతమైన కార్పొరేట్ జీవితానికి పూర్తి భిన్నంగా ప్రశాంతమైన, సంప్రదాయ విలువలతో కూడిన వాతావరణంలో జీవించాలని ఈ దంపతులు కోరుకున్నారు. ముఖ్యంగా ఇంటి నుంచే ఎక్కువసేపు పనిచేస్తున్న (వర్క్ ఫ్రమ్ హోమ్) ప్రస్తుత పరిస్థితుల్లో మానసిక ప్రశాంతతను కలిగించేలా, పాతకాలపు దక్షిణ భారత గృహ నిర్మాణ శైలిని ఆధునిక సౌకర్యాలతో మిళితం చేయాలని నిర్ణయించుకున్నారు. అదే ఈ ఇంటి రూపకల్పనకు ప్రధాన ఆలోచనగా నిలిచిందని డిజైనర్లు తెలిపారు.

సుమారు 4,382 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఇల్లు 2025లో పూర్తైంది. ఇంటి ప్రధాన ఆకర్షణ మధ్యలో ఏర్పాటు చేసిన సాంప్రదాయ ప్రాంగణం (కోర్ట్‌యార్డ్). అయితే అందరి దృష్టిని ఆకర్షిస్తున్న అంశం మాత్రం 130 ఏళ్ల నాటి చెక్క స్తంభాలు. ఈ స్తంభాలను దంపతుల పూర్వీకుల ఇంటి నుంచి జాగ్రత్తగా భద్రపరచి కొత్త ఇంటిలో వినియోగించారు. కొత్త మంగళూరు టైల్స్ పైకప్పునకు సరిపోయేలా ఈ పురాతన స్తంభాలను అమర్చడం డిజైన్ బృందానికి సవాలుగా మారినప్పటికీ, వాటి అసలు రూపానికి ఎలాంటి నష్టం కలగకుండా పనులు పూర్తి చేశారు.

ఇంటి నిర్మాణంలో సహజమైన వస్తువుల వాడకానికి పెద్దపీట వేశారు. ఇటుకలు బయటకు కనిపించేలా గోడలు, మట్టి రంగు ఫ్లోరింగ్, చెక్కతో చేసిన తలుపులు, పెద్ద కిటికీలు, ఎత్తైన పైకప్పులు, సంప్రదాయ ఉయ్యాల వంటి అంశాలు ఇంటికి ప్రత్యేక ఆకర్షణను తెచ్చాయి. మధ్యలోని ప్రాంగణం ద్వారా సహజ కాంతి, గాలి సమృద్ధిగా ప్రవేశించేలా రూపకల్పన చేయడంతో ఇల్లంతా ప్రశాంత వాతావరణం పరచుకుంటుంది. బయట ప్రకృతి, లోపలి జీవనశైలి మధ్య సహజ అనుసంధానం కల్పించేలా వరండా, ప్రవేశ ద్వారాన్ని రూపొందించారు.

బెంగళూరు వంటి నగరాల్లో ఇటీవలి కాలంలో సంప్రదాయ శైలిని ఆధునిక నిర్మాణంతో కలిపే "హెరిటేజ్ ఇన్‌స్పైర్డ్ హోమ్స్"పై ఆసక్తి పెరుగుతోంది. పాతకాలపు నిర్మాణ సామగ్రిని తిరిగి వినియోగించడం, సహజ కాంతి, గాలి, పర్యావరణహిత పదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి ధోరణులు వేగంగా విస్తరిస్తున్నాయి. ఈ ఇంటి రూపకల్పన కూడా అలాంటి మారుతున్న నిర్మాణ ధోరణులకు ప్రతీకగా నిలుస్తోంది.




## లీటరుకు 71 కిమీ మైలేజ్.. ఈ బైక్ ధర ఎంతంటే?



హీరో మోటోకార్ప్ తన ఎంట్రీ లెవల్ కమ్యూటర్ మోటార్‌సైకిల్ అయిన ప్యాషన్ ప్లస్ కొత్త వేరియంట్ లాంచ్ చేసింది. ఇది ఫీచర్ అప్‌గ్రేడ్‌లతో పాటు మెరుగైన భద్రతను అందించే లక్ష్యంతో రూపుదిద్దుకుంది. దీని ధర రూ.84,128 (ఎక్స్ షోరూమ్, ఢిల్లీ). కొత్త వేరియంట్‌లో స్టాండర్డ్ డ్రమ్ బ్రేక్‌కు బదులుగా.. ముందు వైపు డిస్క్ బ్రేక్‌ను అమర్చారు. ఈ అప్‌గ్రేడ్ ముఖ్యంగా అకస్మాత్తుగా బ్రేక్ వేయాల్సి వచ్చే పట్టణ ప్రాంతాల్లో, మెరుగైన బ్రేకింగ్ పనితీరును, నియంత్రణను అందిస్తుందని భావిస్తున్నారు. కొత్త ప్యాషన్ ప్లస్ డిస్క్ హెవీ గ్రే, నెక్సస్ బ్లూ, డార్క్ ఇండస్ట్రియల్ గ్రే, పెర్ల్ రెడ్ అనే నాలుగు డ్యూయల్ టోన్ రంగులలో అందుబాటులో ఉంది. బ్రేకింగ్ అప్‌గ్రేడ్‌తో పాటు, ప్యాషన్ ప్లస్ డిస్క్ పూర్తిగా డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌ను కూడా పొందుతుంది. ఈ కన్సోల్‌లో రియల్ టైమ్ మైలేజ్ ఇండికేటర్, లో ఫ్యూయెల్ వార్నింగ్, సర్వీస్ రిమైండర్స్, కాల్ అండ్ SMS అలర్ట్‌ల కోసం బ్లూటూత్ కనెక్టివిటీ వంటి ఫీచర్లు ఉన్నాయి. అంతే కాకుండా.. ఈ మోటార్‌సైకిల్‌లో ఎల్ఈడీ ప్రొజెక్టర్ హెడ్‌ల్యాంప్, అదనపు భద్రత కోసం సైడ్ స్టాండ్ ఇంజిన్ కట్ ఆఫ్ ఫీచర్, USB ఛార్జింగ్ పోర్ట్, యుటిలిటీ స్టోరేజ్ కంపార్ట్‌మెంట్ వంటివి కూడా ఉన్నాయి. మెకానికల్‌గా ఎలాంటి మార్పులు లేవు. కాబట్టి అదే 100 సీసీ ఇంజన్‌తో పనిచేస్తుంది, ఇది 8,000 ఆర్‌పీఎమ్ వద్ద 5.9 కిలోవాట్ల పవర్, 6,000 ఆర్‌పీఎమ్ వద్ద 8.05 ఎన్ఎమ్ పీక్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ ఇంజన్ హీరో ఐ3ఎస్ (ఐడిల్ స్టాప్‌స్టార్ట్ సిస్టమ్)తో కలిసి పనిచేస్తుంది. ఇది ఇంధన సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఈ బైక్ 71 కిమీ/లీ మైలేజ్ ఉస్తుందని కంపెనీ చెబుతోంది.

## జూన్ 30 తర్వాత పాత నోట్ల రద్దు?: స్పందించిన బ్యాంక్




2026 జూన్ 30 తర్వాత పాత రూ.10, రూ.20, రూ.50, రూ.100 నోట్లను బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర స్వీకరించదని ఒక వార్త వైరల్ సోషల్ మీడియాలో అయింది. దీంతో దేశవ్యాప్తంగా ప్రజల్లో ఆందోళన నెలకొంది. చాలామంది ఇది మరోసారి పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) జరుగుతుందేమోనని భావించారు. అయితే.. ఈ వార్త పూర్తిగా అసత్యమని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర అధికారికంగా స్పష్టం చేసింది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర తన అధికారిక ఫేస్‌బుక్ పేజీలో #FakeMessageAlert హ్యాష్‌ట్యాగ్‌తో ఒక ప్రకటన విడుదల చేసింది. అందులో, ''2005కు ముందు ముద్రించిన రూ.10, రూ.20, రూ.50, రూ.100 నోట్లను 2026 జూన్ 30 తర్వాత మా శాఖలు స్వీకరించవని ప్రచారం జరుగుతోంది. ఈ సమాచారం పూర్తిగా తప్పు. వినియోగదారులు ఇలాంటి తప్పుడు సందేశాలను నమ్మవద్దు, ఇతరులకు పంపవద్దు. అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించండి'' అని తెలిపింది.

### వైరల్ వార్తలో జరిగిన ప్రచారం


వైరల్ అయిన కథనాల ప్రకారం.. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర పాత నోట్లను ఉపసంహరించుకోవాలని ఆదేశాలు జారీ చేసిందని, త్వరలో ఇతర బ్యాంకులు కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తాయని ప్రచారం జరిగింది. దీంతో ప్రజలు తమ వద్ద ఉన్న పాత నోట్లను వెంటనే మార్చుకోవాలని భావించారు. అయితే.. ఈ ప్రచారాన్ని బ్యాంక్ పూర్తిగా ఖండించింది. అంతే కాకుండా.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) కూడా దీనికి సంబంధించిన ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని స్పష్టం చేసింది.

### ఆర్‌బీఐ ప్రకటన

2015లో ఆర్‌బీఐ ఒక ప్రకటన విడుదల చేసింది. అందులో 2005కు ముందు ముద్రించిన మహాత్మా గాంధీ సిరీస్ నోట్ల చలామణి తగ్గిపోయిందని, అవసరమైతే ప్రజలు వాటిని బ్యాంకుల్లో మార్చుకోవచ్చని పేర్కొంది. అయితే.. ఆ నోట్లు చట్టబద్ధమైన కరెన్సీ (Legal Tender)గానే కొనసాగుతాయని కూడా స్పష్టంగా తెలిపింది. కొత్త నోట్లలో భద్రతా ఫీచర్లు మెరుగ్గా ఉండటంతో నకిలీ నోట్ల తయారీని అరికట్టడం సులభమవుతుందని ఆర్‌బీఐ వివరించింది. కానీ.. పాత నోట్లను రద్దు చేస్తున్నట్లు లేదా చెల్లుబాటు కాకుండా చేస్తున్నట్లు ఎప్పుడూ ప్రకటించలేదు.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



## తెలంగాణ ప్రభుత్వానికి ట్రంప్ కృతజ్ఞతలు




**హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో ఓ ప్రధాన రహదారికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు పెట్టడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. యూఎస్ కాన్సులేట్ సమీపంలోని రహదారికి 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా నామకరణం చేయడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసిస్తూ సోషల్ మీడియాలో స్పందించారు. అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. నానక్‌రామ్‌గూడలోని యూఎస్ కాన్సులేట్ వద్ద జరిగిన కార్యక్రమంలో రహదారి నామఫలకాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అమెరికా రాయబారి సెర్జియో గోర్, హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ సమక్షంలో అధికారికంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం తన 'ఎక్స్' వేదికగా స్పందించిన డొనాల్డ్ ట్రంప్..'హైదరాబాద్‌లో కొత్తగా 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ' ఏర్పాటు చేశారు. ఈ విధంగా గౌరవించబడిన మొట్టమొదటి అమెరికా అధ్యక్షుడిని నేనే. ధన్యవాదాలు!' అని పేర్కొన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న తెలంగాణ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఈ నామకరణం ద్వారా భారత్-అమెరికా సంబంధాలు మరింత బలపడతాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి. కార్యక్రమం అనంతరం అమెరికా ప్రతినిధులు కూడా ఈ నిర్ణయాన్ని సానుకూలంగా స్వాగతించినట్లు సమాచారం.

## పగలు నర్సు.. రాత్రైతే నరమాంస భక్షకుడు!

**పగలంతా ఆస్పత్రిలో తెల్ల కోటు వేసుకుని రోగులకు సేవలు.. రాత్రి ఇంటికొచ్చాక మాత్రం మనిషి ఊహించలేని భయానక ప్రపంచం!. మానవ అవయవాలను సేకరించడం.. ఇంట్లో దాచుకోవడం.. వాటితో వింత ప్రయోగాలు చేయడం.. చివరకు వాటిలో కొన్నింటిని తానే తిన్నానని పోలీసుల ఎదుట ఒప్పుకోవడం!. ఇదేదో డబ్బింగ్ సినిమా కథ అనుకునేరు!. ఒక ఆస్పత్రి ఉద్యోగి గురించి బయటపడిన ఈ నిజాలు పోలీసులనే దిగ్భ్రాంతికి గురిచేశాయి. అతడి ఇంట్లో కనిపించిన దృశ్యాలు హారర్ సినిమాలను తలపించగా.. ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా సంచలనంగా మారింది.**



ఆస్పత్రిలో పేషెంట్ ట్రాన్స్‌పోర్టర్ (రోగులను తరలించే ఉద్యోగి)గా పని చేసే ఉద్యోగి(30) చీకటి కోణం షాక్‌కు గురి చేస్తోంది. మానవ అవశేషాలను అక్రమంగా సేకరించడం, వాటిని తన ఇంట్లో నిల్వ చేయడం, చివరకు.. వాటిని వండుకోకుండా పచ్చిగా తీసేశాడన్న అనుమానాలతో పోలీసులు సోదాలు జరిపారు. తనిఖీల్లో దాదాపుగా అవే నిజాలని తెలిసి నిర్ఘాంత పోయారు. చివరకు.. అరెస్ట్ చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన హంగేరీ రాజధాని బుడాపెస్ట్‌లో వెలుగుచూసింది. సోదాల్లో అతడి ఇంట్లో కనిపించిన దృశ్యాలు అధికారులను సైతం విస్మయానికి గురిచేశాయి. మనిషి తల, ముఖం మీది చర్మం, కాలు భాగం, మెదడు, చేయి, పలు పుర్రెలు, ఎముకలు, సూట్‌కేసులో దాచిన అస్థిపంజర భాగాలు.. ఇవన్నీ ఒక ఎత్తయితే ఒక జాడీలో భద్రపరిచిన గుండె పోలీసులకు మాట పడిపోయేలా చేసింది.( ఆ గుండె మనిషిదేనా? లేక జంతువుదా? అనేది ఫోరెన్సిక్ పరీక్షల్లో తేలాల్సి ఉంది)!. జూన్ 17వ తేదీన అతన్ని దర్యాప్తు సంస్థలు అరెస్ట్ చేయగా.. 23న ఆ విషయం బయటకు వచ్చింది. విచారణలో నిందితుడు.. మానవ శరీర భాగాలపై తనకు అమితమైన ఆసక్తి ఉందని.. అందుకే కొన్నింటిని శరీరాల నుంచి తానే వేరుచేసి తిన్నానని అంగీకరించాడు. శరీర నిర్మాణ శాస్త్రం (అనాటమీ), పాథాలజీపై అతడికి విపరీతమైన ఆసక్తి ఉండేదని, జంతువులను కోసి పరిశీలించడం కూడా అతడి హాబీగా మారిందని పోలీసులు వెల్లడించారు. దర్యాప్తులో మరో షాకింగ్ విషయం బయటపడింది. అతడు పనిచేసే ఆస్పత్రి నుంచి, అలాగే హంగేరీ, పొరుగు దేశమైన స్లోవేకియాలోని శ్మశాన వాటికల నుంచి అనాథ శవాల అవశేషాలను దొంగిలించాడని పోలీసులు భావిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న అవయవాలు ఎవరివి? వాటిని ఎక్కడి నుంచి తీసుకొచ్చాడు? అనే అంశాలపై విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో భాగంగా నిందితుడి కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు, ఇతర స్టోరేజ్ పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపించారు. అయితే తన ఎముకల సేకరణ గురించి మాత్రం కుటుంబ సభ్యులు, స్నేహితులతో కూడా బహిరంగంగా మాట్లాడేవాడని, వాటి ఫొటోలు తీసి భద్రపరచేవాడని అధికారులు వెల్లడించారు. అయితే అతన్ని పట్టించిన టిప్ గురించి మాత్రం పోలీసులు ఎలాంటి వివరాలు వెల్లడించలేదు.

### మరిన్ని కేసులు..

ప్రస్తుతం ఈ కేసుపై లోతైన దర్యాప్తు కొనసాగుతోంది. సమాధుల నుంచి మృతదేహాలను ఎలా బయటకు తీశాడు? ఆస్పత్రి నుంచి మృతదేహాల అవశేషాలను ఎలా ఎత్తుకు రాగలిగాడు? అతనికి ఎవరైనా సహకరించారా? నరమాంస భక్షణలో ఇంకా ఎవరైనా పార్టనర్‌లు ఉన్నారా?.. ఇలా అనే కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఫోరెన్సిక్ నివేదికలు వచ్చిన తర్వాత నిందితుడిపై మరిన్ని అభియోగాలు నమోదు చేసే అవకాశం ఉందని హంగేరీ దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి.

## వచ్చే ఏడాది భారత్‌కు ట్రంప్



**వాషింగ్టన్:** భారత్, అమెరికా బంధంలో మరో సరి కొత్త అధ్యాయం మొదలుకాబోతోంది. వచ్చే ఏడాది (2027) ప్రారంభంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశంలో పర్యటించనున్నట్లు యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో అధికారికంగా ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ప్రెసిడెంట్ ట్రంప్ మధ్య ఉన్న వ్యక్తిగత సాన్నిహిత్యం అత్యంత అద్భుతమైనదని కొనియాడిన రూబియో.. ఇరు దేశాల దౌత్య సంబంధాలు 'ఫెంటాస్టిక్' అంటూ అభివర్ణించారు. వాషింగ్టన్ డీసీలో ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో మాట్లాడిన ఆయన, ఈ మెగా పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు తాను ఈ ఏడాది చివరికల్లా భారత్‌లో పర్యటించనున్నట్లు వెల్లడించారు.

### ఫైనల్ స్టేజ్‌లో ట్రేడ్ డీల్

ట్రంప్ పర్యటన కేవలం ఒక విజిట్ మాత్రమే కాదు, దీని వెనుక భారీ వాణిజ్య వ్యూహం దాగి ఉంది. గత 16 నెలల్లో మొదటిసారిగా ఫ్రాన్స్‌లోని ఎవియాన్‌లో జరిగిన జీ7 (G7) సమ్మిట్ వేదికగా మోదీ, ట్రంప్ ఇరు పక్షాల మధ్య చర్చలు జరిపారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చివరి దశకు చేరుకుందని రూబియో పేర్కొన్నారు. 'మేం ట్రేడ్ డీల్‌ను పూర్తి చేసేందుకు కేవలం అంగుళాల దూరంలో ఉన్నాం, ఇది చాలా సానుకూల పరిణామం' అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందం పూర్తయితే రెండు దేశాల ఆర్థిక వ్యవస్థల్లో పెను మార్పులు రానున్నాయి.

### మోదీపై రూబియో ప్రశంసలు

ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని మార్కో రూబియో ఆకాశానికెత్తారు. తాను మోదీకి పెద్ద 'ఫ్యాన్' అని చెబుతూ, అంతర్జాతీయ వేదికపై భారతదేశ ప్రతిష్టను మోదీ సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లారని కొనియాడారు. 'మోదీ భారతదేశాన్ని ఒక గ్లోబల్ పవర్‌గా (ప్రపంచ శక్తిగా) మార్చారు' అని రూబియో వ్యాఖ్యానించారు. అలాగే, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అత్యంత కీలకమైన 'క్వాడ్' కూటమి తదుపరి సమావేశం కోసం ఇరు దేశాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### ఎనర్జీ సెక్టార్‌లో మెగా పార్ట్‌నర్‌షిప్

ఇక ఇంధన రంగం పరంగా భారత్ ప్రాధాన్యతను అమెరికా ప్రత్యేకంగా గుర్తించింది. ఇంధన సరఫరాను మరింత పెంచేందుకు ఇరు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని రూబియో తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత భారీ క్రూడ్ ఆయిల్ను శుద్ధి చేసే అరుదైన సాంకేతిక సామర్థ్యం కలిగిన కొన్ని దేశాల్లో భారతదేశం ఒకటని ఆయన ప్రశంసించారు. ఒకవేళ వచ్చే ఏడాది ట్రంప్ భారత్‌కు వస్తే, 2020 ఫిబ్రవరి తర్వాత ఆయనకు ఇదే మొదటి భారత పర్యటన అవుతుంది.

## వ్యాపారిపై కాల్పుల కలకలం : అందరి లెక్కలు తేలుస్తా అంటూ సంచలన హెచ్చరిక



పోర్చుగల్‌లో భారత సంతతి వ్యాపారవేత్తపై కాల్పులు జరిపిన ఘటన కలకలం రేపింది. పోర్చుగల్‌లోని ఒడివెలస్ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యాపారవేత్తను కిషోర్ గుజరాతీగా గుర్తించారు. దీనికి తోడు 'ప్రపంచంలో నువ్వు ఎక్కడికి వెళ్ళినా, అక్కడే నిన్ను చంపేస్తాం', అంటూ కాల్పుల తర్వాత ఒక గ్యాంగ్‌స్టర్ బెదిరింపు వీడియో మరింత సంచలనం రేపుతోంది. అయితే, ఈ దాడి వెనుకున్నకారణాలేంటి, బెదిరించిన గ్యాంగులు ఎవరు అనేది తెలియరాలేదు. సోషల్ మీడియాలో ఈ దాడికి సంబంధించి పలు రకాల ప్రచారాలు జరుగుతున్నప్పటికీ, స్థానిక అధికారులు మాత్రం నేరస్థ ముఠాలతో సంబంధం ఉన్నట్లు ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు కనుగొనలేదు. అయితే ఈ దాడి జరిగిన కొద్దిసేపటికే, ఫేస్‌బుక్‌లో 'రాహుల్ ఆర్‌కే మీనా' అనే అకౌంట్ నుండి ఈ కాల్పుల బాధ్యతను తామే తీసుకుంటున్నట్లు ఒక పోస్ట్ నెట్టింట హల్‌చల్ చేస్తోంది. అయితే, ఈ సోషల్ మీడియా ఖాతాను, దాని విశ్వసనీయతను లేదా ఆ పోస్టులోని నిజానిజాలనుగానీ ఇంకా ఎవరూ ధృవీకరించలేదు.

ఆ పోస్టులో ఇలా ఉంది: నా సోదరులందరికీ నమస్కారాలు. ఈ రోజు పోర్చుగల్‌లోని సిడేడ్ నోవా ఒడివెలస్ సమీపంలో కిషోర్ గుజరాతీపై జరిగిన కాల్పుల బాధ్యతను రాహుల్ ఆర్‌కే మీనా అనే నేను స్వీకరిస్తున్నాను. మా మెసేజ్‌లని నిర్లక్ష్యం చేయడం అంటే మరణాన్ని ఆహ్వానించడమే." అంటూ ఒక సంచలన పోస్ట్ పెట్టాడు.అంతటితో ఆగకుండా, ఆ పోస్టులో మరిన్ని హెచ్చరికలు కూడా జారీ చేశాడు. "మేము ఎవరికైతే ఫోన్లు/ సందేశాలు పంపామో.. వారంతా సిద్ధంగా ఉండండి. ఏ క్షణంలోనైనా మీ శరీరాల్లోకి బుల్లెట్లు దూసుకెళ్ల వచ్చు. అవకాశం దొరికిన వెంటనే దాడి చేస్తాం. నేను అందరితోనూ లెక్కలు తేలుస్తాను. మా పరిధి, ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయి. సరైన సమయం కోసం వేచి ఉండండి. మా తదుపరి దాడి దీనికంటే చాలా దారుణంగా ఉంటుంది!"అంతేకాకుండా, ఆ పోస్టులో భారతదేశానికి చెందిన కొన్ని నేరపూరిత ముఠాలైన 'సునీల్ మీనా గ్యాంగ్', 'అమన్ సాహు గ్యాంగ్' పేర్లను కూడా ప్రస్తావించడం గమనార్హం. పోర్చుగల్ అధికారులు ఈ సోషల్ మీడియా పోస్టుల విశ్వసనీయతను ఇంకా ధృవీకరించలేదు. అలాగే ఈ దాడికి, అంతర్జాతీయ నేర ముఠాలకు మధ్య ఎటువంటి సంబంధం ఉందనే దానిపై విచారణ జరుగుతోంది. బాధ్యత వహిస్తూ సదరు వ్యక్తి విడుదల చేసినట్లు చెబుతున్న ఒక వీడియోతో పాటు ఆన్‌లైన్ కంటెంట్‌ను కూడా అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా డిజిటల్ ఆధారాలు, ఘటనా స్థలానికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ , ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికలను విశ్లేషిస్తున్నారు. ఈ దాడికి గల అసలు కారణాన్ని అధికారులు ఇంకా వెల్లడించలేదు. దర్యాప్తు కొనసాగుతున్నందున సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను, ధృవీకరించని సమాచారాన్ని నమ్మొద్దని ప్రజలను కోరారు.



# ప్రేక్షకులతో కలిసి రిస్క్ సినిమా చూసిన హీరో సందీప్

**యాదాద్రి భువనగిరి జూన్ 27 మహా**
మీ బిడ్డ గా నన్ను ఆశీర్వదించండి అని రిస్క్ సినిమా హీరో సందీప్ పాశ్వ అన్నారు.... భువనగిరిలో ఆయన ప్రేక్షకులతో కలిసి సినిమా తిలకించారు యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి వసుంధర థియేటర్ లో శనివారం మధ్యాహ్నం భువనగిరి పట్టణానికి చెందిన సినిమా హీరో రావటం చే రిస్క్ సినిమా యూనిట్ హీరోలు సానియా ఠాకూర్, జోయా జోవేరి, కెమెరా మెన్ జగదీష్ స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులతో థియేటర్ వద్ద ప్రత్యేకత సంతరించుకుంది. సినిమా హీరో ప్రేక్షకులతో కలిసి సినిమాను వీక్షించారు. స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ సినిమా హీరో కు టపాసులు కాలుస్తూ, స్వాగతం పలికి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి, శ్రీ స్వర్ణ గిరి వెంకటేశ్వర స్వామి కృప వల్ల భువనగిరి ముద్దుబిడ్డ సందీప్ విశ్వ మునుముందు పెద్ద హీరోగా ఎదగాలని ఆకాంక్షించారు. సినిమా నిర్మాత రావి శైలజ సురేష్ రెడ్డి మాట్లాడుతూ హీరో మొదటి సినిమాలోనే తన ప్రత్యేక ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. సంవత్సరం క్రితం అనుకున్న ప్లాన్ ప్రకారంగా సినిమా పూర్తి చేసి విడుదల చేయడం జరిగిందని అన్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆదరించే తరహాలో రూపొందించడం జరిగిందని తెలిపారు. సినిమా డైరెక్టర్ సంగీత దర్శకులు ఘంటాడి కృష్ణ మాట్లాడుతూ, సినిమా హీరోకు భవిష్యత్తు ఉన్నదని మొదటి సినిమాలోని అనుభవజ్ఞులైన హీరోల తరహాలో నటించడం తనకెంతో సంతృప్తిని ఇచ్చింది అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ తంగేళ్లపల్లి రవికుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు, వెల్లముల జంగయ్య యాదవ్,నేత మోత రాష్ట్ర నాయకులు భువనగిరి శ్రీనివాస్, డిసిసి ఉపాధ్యక్షులు సుక్క స్వామి, చిక్కుల వెంకటేష్, కొండాపురం గణేష్, పెంటారెడ్డి, చెట్టోజు గోపాల్, డాక్టర్ జగదీష్,గాదే కరుణాకర్, జమాల్ సినిమా యూనిట్ నాయకులు అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నిండు ప్రాణానికి రెండు చుక్కలు

- **పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలి**
- **జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



హనుమకొండ మహా; పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, జననం నుంచి ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పిలుపునిచ్చారు. నిండు ప్రాణానికి రెండు చుక్కలు అనే నినాదంతో ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల 84,301 మంది చిన్నారులకు పోలియో వ్యాక్సిన్ అందించే లక్ష్యంతో సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 460 పోలియో బూత్‌లు, 27 మొబైల్ బృందాలు, 12 ట్రాన్సిట్ బృందాలు, 27 పర్యవేక్షణ బృందాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు 1,804 మంది సిబ్బందిని నియమించి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 28వ తేదీ (ఆదివారం) జిల్లాలోని గ్రామ పంచాయతీలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. అనంతరం 29, 30 తేదీల్లో మొదటి రోజు వ్యాక్సిన్ తీసుకోలేని చిన్నారులను గుర్తించి ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని చెప్పారు. పోలియో నిర్మూలనలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి వారి ఆరోగ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, ఇతర శాఖల సిబ్బంది సమన్వయంతో ఏ ఒక్క చిన్నారి కూడా వ్యాక్సిన్‌కు దూరం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని, సమీప పోలియో కేంద్రానికి తమ చిన్నారులను తీసుకువచ్చి రెండు పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి కోరారు.

# కనకదుర్గమ్మకు బోనం

**యాదాద్రి భువనగిరి జూన్ 27 మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలోని శ్రీ కనకదుర్గమ్మ 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి కనకదుర్గమ్మ అమ్మవారికి బోనం సమర్పించి,మొక్కులు చెల్లించుకున్నారు.. శోభారాణి వెంట మహిళ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.







# గోదావరి వరదలను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

- **అందుకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలి**
- **పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి**
- **వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**భద్రాద్రి బ్యూరో, మహా:** గోదావరి నదిలో వరదల నేపథ్యంలో ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్ చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.శనివారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో గోదావరి వరదలను ఎదుర్కొనేందుకు తీసుకునే చర్యల్లో భాగంగా జిల్లా స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎలినోవో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రతి శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఎలాంటి ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వరదల అనంతరం అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్య చర్యలను ముమ్మరం చేయాలని వైద్యశాఖ అధికారులు అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. భద్రాచలం పట్టణంలో గోదావరి నీరు చేరకుండా వర్షపు నీరు వేగంగా నదిలోకి వెళ్లేలా పంపింగ్ మోటార్లను సిద్ధంగా ఉంచాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. తాగునీరు వైద్యం వంటి అత్యవసర సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని రైతులకు అవసరమైన విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు వ్యవసాయ అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు సలహాలు అందించాలన్నారు. గిరిజన రైతులు ఉద్యానవన పంటల సాగుపై దృష్టి సారించేలా అవగాహన కల్పించాలని ఎరువులు ముఖ్యంగా యూరియా వినియోగంపై శాస్త్రీయ అవగాహన కల్పించాలని సూచించారు.

వనమహోత్సవంలో భాగంగా జాతీయ రహదారుల వెంట విస్తృతంగా మొక్కలు నాటాలని వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాను పరిశుభ్రంగా సుందరంగా తీర్చిదిద్దాలని మంత్రి పిలుపునిచ్చారు. జిల్లాలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధి పనులు పుష్కరాల ఏర్పాట్లు ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్నందున అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

అనంతరం మంత్రి భద్రాచలం-కూనవరం రహదారిపై చేపడుతున్న కరకట్ట నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో ఆరా తీశారు. మూడు సంవత్సరాలుగా పనులు పూర్తికాకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సారపాక జాతీయ రహదారిపై ఐటీసీ ఈస్ట్ గేట్ సమీపంలో గోదావరి వరదల సమయంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ ఆ ప్రాంతంలో జాతీయ రహదారి ఎత్తును పెంచేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసి చర్యలు చేపట్టాలని జాతీయ రహదారుల శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ గోదావరి వరదల సమయంలో ప్రజల ప్రాణ ఆస్తి రక్షణకు పోలీసు శాఖ పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉందన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి రెవెన్యూ ఎస్‌డీఆర్ఎఫ్ ఎన్‌డీఆర్ఎఫ్ తదితర శాఖలతో సమన్వయంగా సహాయక చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజలు అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ వరదల వల్ల ఎలాంటి ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖలు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వరదలకు ముందు వరదల సమయంలో అనంతరం చేపట్టాల్సిన చర్యలపై సమగ్ర సన్నద్ధతతో ఉండాలని వర్షపాతం వరద పరిస్థితులపై ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని కోరారు. పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గోదావరి వరదల సమయంలో బూర్గంపాడు అశ్వాపురం ప్రాంతాలు అధికంగా ప్రభావితమవుతాయని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. వరదల సన్నద్ధతలో పరిశ్రమల సహకారాన్ని కూడా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటిడిఏ పిఓ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, వైద్య, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, అటవీ, అగ్నిమాపక, ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ ను సద్వినియోగం చేసుకోవాలి

- **కాంగ్రెస్ నాయకులు జన్ను శ్యామ్**

**మహా వరంగల్ పోచమ్మ మైదాన్;** వరంగల్ తూర్పు నియోజకవర్గం 25 డివిజన్ పరిధిలోని మాజీ కార్పొరేటర్ బస్వరాజు శిరీష శ్రీమాన్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు జన్ను శ్యామ్ 25 వ డివిజన్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించడం తో పాటు అర్హులైన ఓటర్లకు ఎస్ ఐ ఆర్ దరఖాస్తు ఫారాలను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడి ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు అని ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను సరిచూసుకుని, అవసరమైతే ఎస్ ఐ ఆర్ ఫారాన్ని నింపి సంబంధిత బిఎల్ ఓ లావణ్య కు సమర్పించి తమ ఓటు హక్కును పరిరక్షించు కోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 25వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# టైలరింగ్ షాపుల సంక్షేమానికి పట్టణ ప్రజల సహకారం అవసరం

**టైలరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గెల్లి రాజలింగు యాదవ్**

**బెల్లంపల్లి మహా:** పట్టణం బెల్లంపల్లి పట్టణంలో టైలరింగ్ షాపులు నిర్వహిస్తున్న కార్మికుల సంక్షేమానికి పట్టణ ప్రజల సహకారం అవసరమని టైలరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గెల్లి రాజలింగ యాదవ్ వెల్లడించారు. శనివారం నాడు బెల్లంపల్లి పట్టణంలోనిస్థానిక అజంత టైలరింగ్ వర్క్‌షాప్ లో టైలరింగ్ యూనియాన్ యజమానులు మరియు టైలరింగ్ వర్కర్లు సమావేశం బెల్లంపల్లి టైలరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గెల్లి రాజలింగు అధ్యక్షతన జరిగింది.సమావేశంలో ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో టైలరింగ్ వర్కర్స్ పనులకు సంబంధించిన రేట్లను నిర్ణయించడం జరిగింది . ఈ రేట్లు 29062026 నుండి 29062028 వరకు అమలులో ఉంటాయని సమావేశంలో టైలరింగ్ వర్కర్స్ కు రేట్లను పెంచడం ఏకగ్రీవంగా నిర్ణయించారు.ఒప్పందానికి సంబంధించిన సమాచారాన్ని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తో పాటు మంచిర్యాల లేబర్ కమిషనర్,బెల్లంపల్లి లేబర్ ఆఫీసర్లకి అధికారికంగా అందించడం జరిగింది.





# హెచ్ఆర్డి స్కూల్ ముందు ఎస్ఎఫ్ఐ ధర్నా.!

- **పాఠ్యపుస్తకాలు యూనిఫామ్ పాఠశాలలోనే కొనాలి యాజమాన్యం**
- **ఇబ్బందులకు గురి గురవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు**
- **చోద్యం చూస్తున్న మండల విద్యాధికారి.!**

**ఇబ్రహీంపట్నం జూన్ 27 మహా:** సీతారాంపేటలోని హెచ్ఆర్డి స్కూల్ లో పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ పేరిట విద్యార్థుల తల్లితండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్న అధికారులు చోద్యం చూస్తున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపేటలో గల హెచ్ఆర్డి స్కూల్ లో పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ పేరిట విద్యార్థుల తల్లితండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నరని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్కూల్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు తరంగ్ మాట్లాడుతూ... సీతారాంపేటలోని హెచ్ ఆర్ డి స్కూల్ లో పాఠ్యపుస్తకాలు యూనిఫామ్స్ తమ పాఠశాలలోనే కొనాలంటూ స్కూల్ యాజమాన్యం, విద్యార్థుల తల్లితండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో.1 ప్రకారం పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పాఠశాల ప్రాంగణంలో అమ్మడం నిషేధం, ఐనప్పటికి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు వాపోయారు. స్కూల్లో యూనిఫామ్స్ పాఠ్యపుస్తకాలు ఎవరి ప్రోత్సాహంతో అమ్ముతున్నారని ప్రశ్నించిన ఎస్ఎఫ్ఐ నాయకులు పై ఇష్టానుసారంగా విరుచుకుపడ్డ హెచ్ఆర్డి స్కూల్ యాజమాన్యం. ఇలాంటి విషయాలపై గతంలో అధికారులకు తెలిపిన పట్టించుకోకపోవడం వెనకాల అనేక సందేహాలు ఉన్నాయని విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

- **డయల్ యువర్ బెల్లంపల్లి ఎమ్మెల్యే' కార్యక్రమంలో ప్రజా సమస్యలకు తక్షణ స్పందన**





**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి నియోజకవర్గం లోని ప్రజల సమస్య ల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పేర్కొన్నారు. శనివారం రోజు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆధ్వర్యంలో నిర్వహించిన "డయల్ యువర్ ఎమ్మెల్యే*" కార్యక్రమంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే శ్రీ గడ్డం వినోద్ వెంకటస్వామి పాల్గొని ప్రజల నుంచి ఫోన్ ద్వారా నేరుగా ఫిర్యాదులు, సమస్యలను స్వీకరించారు.నియోజకవర్గంలోని ఏడు మండలాలకు, బెల్లంపల్లి మున్సిపాలిటీకి, చెందిన ప్రజలు రహదారులు, డ్రైనేజీ సమస్యలు, గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించడం, ఇల్లు లేని అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు తదితర ప్రజా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ప్రతి సమస్యను ఎమ్మెల్యే స్వయంగా నమోదు చేసుకుని, సంబంధిత అధికారులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపే దిశగా నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తలెత్తే సమస్యలను ముందస్తుగా గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విన్న ఎమ్మెల్యే , ప్రతి సమస్యను బాధ్యతగా పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా "ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా ప్రజల సమస్యల పరిష్కారమే తన తొలి ప్రాధాన్యత" అని ఎమ్మెల్యే శ్రీ గడ్డం వినోద్ వెంకటస్వామి పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం.. మార్కెట్ కమిటీలు రైతులకు అండగా నిలవాలి

- **ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి**


**బెల్లంపల్లి, మహా:** రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా మార్కెట్ కమిటీలు రైతులకు అండగా నిలవాలి అని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పేర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం మహోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు.బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ రత్నం సుకుమారి, వైస్ చైర్మన్‌గా రవీందర్ రావు ఘనంగా పదవీ ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమానికి ముందు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.ర్యాలీ ఏఎంసీ ప్రాంగణానికి చేరుకున్న అనంతరం కేంద్ర మంత్రివర్యులు, దివంగత ప్రజా నేత గడ్డం వెంకటస్వామి (కాక) విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో *భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో కలిసి భారీ ర్యాలీగా బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయానికి చేరుకుని ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు.మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ రత్నం సుకుమారి , వైస్ చైర్మన్ రవీందర్ రావు తో పాటు కమిటీ సభ్యులు పదవీ ప్రమాణం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి మాట్లాడుతూ రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. రైతులకు గిట్టుబాటు ధర, పారదర్శకమైన సేవలు, మెరుగైన సౌకర్యాలు అందేలా వ్యవసాయ మార్కెట్ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలి. నూతనంగా బాధ్యతలు చేపట్టిన చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యులు రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, మార్కెట్ కమిటీని ఆదర్శవంతమైన సంస్థగా తీర్చిదిద్దాలని" సూచించారు.అనంతరం నూతన చైర్మన్ రత్నం సుకుమారి కి, వైస్ చైర్మన్ ఎస్. రవీందర్ రావు కి, కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేసి విజయవంతంగా బాధ్యతలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా డీసీసీ అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి , బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ దావ స్వాతి రమేష్ బాబు , మార్కెట్ కమిటీ డైరెక్టర్ భాస్కర్ ,ఏడు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షుడు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు శుభాకాంక్షలు తెలిపారు....



రైతుల సంక్షేమానికి కృషి చేయాలి.. రాష్ట్ర టిపి సిసి ప్రచార కమిటీ కన్వీనర్ నాతరిస్వామి... నూతనంగా బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు పాలకవర్గం రైతుల సంక్షేమానికి కృషిచేసి అభిమానాన్ని చురగొనాలని రాష్ట్ర టిపీసిసి పరిచార కమిటీ కన్వీనర్ నేతరి స్వామి ఆకాంక్షించారు ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ఆయన శాలువాలతో నూతన పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు.

# అలాంటివాళ్లు చూడకూడని సినిమా

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. వాటిలో హాలీవుడ్ చిత్రం 'ప్రైమేట్' ఒకటి. ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమ్ అవుతున్న ఈ చిత్రం గురించి తెలుసుకుందాం. భయం... మనిషిని, మనిషి ఆలోచనలను ఎలాంటి స్థితిలోనైనా ఏ క్షణమైనా ఆపేయగల ఏకైక భావోద్వేగం ఈ భయం. ఎంతటి ధైర్యవంతులైనా, దమ్మున్నవారైనా ఈ భయమనేది ఒక్కసారి కలిగితే పరిగెత్తాల్సిందే. ఆ నేపథ్యంలో ఎన్నో సినిమాలను ఇప్పటికే మనం చూశాం. కానీ ఈ 'ప్రైమేట్' సినిమా కొంత విభిన్నం. ప్రైమ్ వీడియో వేదికగా ఈ చిత్రం స్టీమ్ అవుతోంది. మొదటి పది నిమిషాలు వదిలేస్తే మిగతా ప్రతి నిమిషం ప్రేక్షకుడిని భయంతో ఉక్కిరిబిక్కిరి చేస్తుందీ సినిమా. అందుకే భయపడేవారు, అనారోగ్యంగా ఉన్నవారు ఈ సినిమాకి దూరంగా ఉండడమే మంచిది. అంతలా ఏముందో ఈ సినిమాలో ఓసారి చూద్దాం. హవాయి కొండ ప్రాంతంలో లూసీ కుటుంబం ఓ చింపాజీతో



పాటు ఉంటుంది. చింపాంజీని తమ కన్నబిడ్డలకన్నా మమకారంగా పెంచుకుంటుంటారు. చింపాంజీని బెన్ అని పిలుచుకుంటారు. ఓ రోజు ఎక్కడ నుండో వచ్చిన మంగూస్ అనుకోకుండా బెన్‌ని కరిచి వెళ్ళగా దానికి ర్యాబిస్ వ్యాధి సోకుతుంది. దాంతో బెన్ పిచ్చి పిచ్చిగా ప్రవర్తిస్తుంటుంది. ఇవేమీ తెలియని లూసీ తన స్నేహితులను చిన్న పార్టీ కోసం ఇంటికి పిలుస్తుంది. ఇంతలో పిచ్చి పట్టిన బెన్ ఏమో లూసీ స్నేహితులలో ఒకరిని అత్యంత కిరాతకంగా దాడి చేసి, చంపేస్తుంది. దీంతో బిత్తరపోయి భయపడ్డ లూసీ బృందం స్విమ్మింగ్ పూల్‌లో దూకేస్తుంది. ర్యాబిస్ సోకిన చింపాంజీకి నీళ్ళంటే అలర్జీ కాబట్టి వాళ్ళ దగ్గరకు రావాలని చాలా ప్రయత్నాలు చేస్తుంటుంది. మరి... నీళ్ళలో ఉన్న లూసీ బృందం బెన్ చేతికి చిక్కుతుందా? లేక లూసీవాళ్ళు తప్పించుకుంటారా? అన్న విషయాన్ని మాత్రం 'ప్రైమేట్' సినిమాలో చూడాల్సిందే. ఈ సినిమా సూపర్ థ్రిల్లింగ్. అందుకే భయపడేవారు, అనారోగ్యం ఉన్నవారు ఎట్టి పరిస్థితుల్లో ఈ సినిమాని చూడకూడదు. థ్రిల్లింగ్ జోనర్ ఇష్టపడేవాళ్ళకి ఈ సినిమా ఓ ఫుల్ మీల్స్ అని చెప్పవచ్చు. ప్రేక్షకుడు సినిమా మొత్తం కన్నార్పకుండా కూర్చోబెట్టే స్క్రీన్‌ప్లేతో కూడుకున్నదీ సినిమా. మస్ట్ వాచ్ ఫర్ థ్రిల్లింగ్ లవర్స్.



## అలాంటి అహంకారపు మాటలు నేను ఎప్పుడు మాట్లాడలేదు: శ్రీలీల

కాయలున్న చెట్టుకే రాళ్లు అంటారు. అలా వాస్తవం ఏమిటన్నది పక్కన పెడితే సెలబ్రిటీలు, ముఖ్యంగా సినీ పాపులర్ కళాకారులు వదంతులు ఎదుర్కోక తప్పని పరిస్థితి. వదంతుల మధ్య వాస్తవాలు మరుగున పడుతున్నారంటే వాదన వినిపిస్తోంది. ఇప్పుడు వదంతులకు సినిమాలో ఎవరూ అతీతులు కాదు అనిపిస్తోంది. అలాంటి పరిస్థితిని శ్రీలీల ఎదుర్కొంటున్నారు. యూనైటెడ్ స్టేట్స్‌లో వైద్య విద్యను అభ్యసించిన ఈ బ్యూటీ నటిగా మాత్రం బాల్యంలోనే కన్నడంలో రంగప్రవేశం చేశారు. ఆ తరువాత కిస్ అనే చిత్రంలో నాయకిగా నటించారు. తెలుగులో చిత్రాంగధ చిత్రంతో ఎంట్రీ ఇచ్చినా పెళ్లి సందడి చిత్రంతో పాపులర్ అయ్యారు. ఆ తరువాత నటించిన ధమాకా చిత్రం కమర్షియల్‌గా మంచి విజయాన్ని అందించింది. ఇప్పుడు శ్రీలీల క్రేజీ హీరోయిన్. పరాశక్తి చిత్రంతో కోలీవుడ్‌లోకి దిగుమతి అయిన ఈ బ్యూటీ బాలీవుడ్‌ను టచ్ చేశారు. అందంతోపాటు డాన్స్‌లోనూ యువతను గిలిగింతలు పెట్టిస్తున్నారు. డాన్స్‌లో ప్రతిభే ఇప్పుడు ఈమెను వదంతులను గురి చేస్తోంది. డాన్స్‌తో తనతో పోటీ పడే హీరోగానీ, హీరోయిన్‌గానీ ఎవరూ లేరని శ్రీలీల అన్నట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

ఈ ప్రచారాన్ని శ్రీలీల ఖండించారు. అలా మాట్లాడేంత అహంకారం తనకు లేదని అని స్పష్టం చేశారు. తాను అలాంటి వాతావరణంలో పెరగలేదని పేర్కొన్నారు. తాను అందరినీ గౌరవించే వ్యక్తినన్నారు. ఇలాంటి వదంతులను ప్రచారం చేసే వారు ఇకపై అయినా తమ మైండ్‌సెట్‌ను మార్చుకోవాలన్నారు. తన గురించి తెలిసిన వారికి తానేమిటో తెలుసని శ్రీలీల పేర్కొన్నారు.






## 'రాకా'లోకి రష్మిక ఎంట్రీ.. బన్నీతో మరోసారి..

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, నేషనల్ క్రష్ రష్మిక మరోసారి వెండితెరపై జోడీగా కనిపించబోతున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఇండస్ట్రీ వర్గాలు. ఇప్పటికే పుష్ప, పుష్ప 2లో చిత్రాల్లో జోడీగా నటించి మెప్పించిన ఈ జంట.. ఇప్పుడు 'రాకా' కోసం మరోసారి స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నారట. త్వరలోనే ముంబైలో జరగబోయే కొత్త షెడ్యూల్‌లో రష్మిక పాల్గొనబోతున్నట్లు సమాచారం. అయితే ఈ చిత్రంలో రష్మికతో పాటు దీపికా పదుకొణె, మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇప్పటికే దీపికా పదుకొణె షూటింగ్‌లో పాల్గొంది. కొత్త షెడ్యూల్‌లో రష్మికతో పాటు మృణాల్, జాన్వీలకు సంబంధించిన కీలక సీన్లను కూడా షూట్ చేయబోతున్నారట. ఇక ఈ సినిమాలో షారుక్ ఖాన్ కూడా కీలక పాత్ర చేయబోతున్నట్లు ఇండస్ట్రీ టాక్. అయితే దీనిపై మేకర్స్ నుంచి ఇప్పటి వరకు ప్రకటన రాలేదు. త్వరలోనే ఓ ఈవెంట్ నిర్వహించి, షారుక్ పాత్రకు సంబంధించిన అప్‌డేట్ ఇస్తారట. ఈ చిత్రాన్ని తమిళ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ రూ. 700 కోట్ల బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ ఏడాది చివరిలో షూటింగ్ పూర్తి చేసుకొని.. వచ్చే ఏడాది డిసెంబర్‌లో రిలీజ్ చేయాలని మేకర్స్ టార్గెట్‌గా పెట్టుకున్నారు.

## మొన్ననే నవ్వుతూ జోకులు వేసుకున్నాం..: చిరంజీవి

### భాగ్యరాజ్ మరణం పట్ల చిరంజీవి దిగ్భ్రాంతి





ప్రముఖ దర్శకుడు, నటుడు కె. భాగ్యరాజ్ అకాల మరణం పట్ల మెగాస్టార్ చిరంజీవి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఉదయం ఆయన మరణవార్త వినడం తనను తీవ్ర కలతకు గురిచేసిందని, ఇది నమ్మశక్యంగా లేదంటూ ఎక్స్ వేదికగా ఆయన సంతాపం ప్రకటించారు. 'మాటల్లో చెప్పలేనంత తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. మొన్ననే మేమిద్దరం గోవాలో జరిగిన నటి కుష్బూ కుమార్తె వివాహ వేడుకలో కలుసుకున్నాం. అక్కడ ఎంతో నవ్వుతూ, సరదాగా జోకులు వేసుకుంటూ, కలిసి ఫోటోలు దిగాం. భాగ్యరాజ్ గారు ఎప్పుడూ ఎంతో ఉత్సాహంగా, ఆనందంగా ఉండేవారు. అలాంటి వ్యక్తి ఈ ఉదయం ఇక లేరనే వార్త వినడం నన్ను తీవ్రంగా కలిచివేసింది' అని చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు.

భాగ్యరాజా సినీ రంగానికి చేసిన సేవలను కొనియాడుతూ... ఆయన ఒక ప్రతిభావంతుడైన చిత్రనిర్మాత, అద్భుతమైన స్క్రీన్‌ప్లే రచయిత, గొప్ప నటుడని చిరంజీవి ప్రశంసించారు. భారతీయ సినిమాకు ఆయన అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని కొనియాడారు. భాగ్యరాజా భార్య పూర్ణిమకి, వారి కుటుంబ సభ్యులందరికీ చిరంజీవి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కోలుకోలేని నష్టాన్ని భరించే శక్తిని ఆ భగవంతుడు ఆ కుటుంబానికి ప్రసాదించాలని ఆయన ప్రార్థించారు.

# విషాదం.. ప్రముఖ నటుడు, దర్శకుడు కె.భాగ్యరాజ్ కన్నుమూత

తమిళ చిత్రపరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ నటుడు, దర్శకుడు కె. భాగ్యరాజ్ (73) కన్నుమూశారు. గుండెపోటుతో ఆయన శనివారం ఉదయం చెన్నైలో తుదిశ్వాస విడిచారు. 25 సినిమాలకు దర్శకత్వం వహించడంతో పాటు నటుడిగా 75 సినిమాలు చేశాడు. భాగ్యరాజ్ అకాల మరణంతో కోలీవుడ్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటించారు. కె. భాగ్యరాజ్ కేవలం నటుడిగానే కాకుండా దర్శకుడిగా, స్క్రీన్‌ప్లే రచయితగా, నిర్మాతగా, సంగీత దర్శకుడిగా బహుముఖ ప్రజ్ఞను చాటుకున్నారు. ముఖ్యంగా ఆయన రాసే స్క్రీన్‌ప్లేలు, సామాన్య ప్రజలను ఆకట్టుకునే మధ్యతరగతి కథలు సినిమా ఇండస్ట్రీలో ఒక కొత్త ట్రెండ్‌ను సృష్టించాయి. ప్రముఖ దర్శకుడు భారతీరాజా వద్ద '16 వయదినిలే' (తెలుగులో పదహారేళ్ల వయసు) చిత్రానికి సహాయ దర్శకుడిగా కెరీర్ ప్రారంభించారు. ఆ సినిమాలో ఒక చిన్న పాత్రలోనూ కనిపించారు. 1979లో 'సువరిల్లాద చిత్రంగళ్' సినిమాతో దర్శకుడిగా మారారు. ఆ తర్వాత హీరోగా, దర్శకుడిగా ఆయన చేసిన ప్రయోగాలు సూపర్ హిట్ అయ్యాయి. 'అన్థా 7 నాట్కళ్' (తెలుగులో రాధా కళ్యాణం), 'ముంధానై ముడిచ్చు' (తెలుగులో మూఢు ముళ్లు), 'దూరల్ నిన్ను పోచ్చు' వంటి చిత్రాలు బ్లాక్‌బస్టర్ హిట్‌లుగా నిలిచాయి.

ఆయన తమిళంలో రూపొందించిన ఎన్నో అద్భుతమైన కథలు తెలుగు, హిందీ భాషల్లోకి రీమేక్ అయ్యాయి. అమితాబ్ బచ్చన్ నటించిన 'ఆఖరి రాస్తా' చిత్రానికి భాగ్యరాజ్ కథ, స్క్రీన్‌ప్లే అందించడం విశేషం. ఫ్యామిలీ విషయాలకొస్తే.. తమిళనాడులోని ఈరోడ్ జిల్లా వెల్లాంకోయిల్ ఆయన స్వస్థలం. 1981లో నటి ప్రవీణను వివాహం చేసుకున్నారు. అయితే, 1983లో కామెర్ల వ్యాధితో ఆమె చిన్న వయసులోనే మరణించారు. ఆ తర్వాత 1984లో ప్రముఖ నటి పూర్ణిమ



జయరామ్‌ను ఆయన రెండవ వివాహం చేసుకున్నారు. పూర్ణిమ తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో స్టార్ హీరోయిన్‌గా (తెలుగులో 'మగమహారాజు' వంటి చిత్రాల్లో) రాణించారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొడుకు శంతను భాగ్యరాజ్ హీరోగా హీరోగా రాణిస్తున్నాడు. కూతురు శరణ్య భాగ్యరాజ్ 'పారిజాతం' వంటి కొన్ని సినిమాల్లో హీరోయిన్‌గా నటించారు.

### తెరపై నవ్వులు పూయిస్తూనే..

భాగ్యరాజ్ సినిమాల ప్రత్యేకత కథల్లోనే కాదు.. వాటి వెనుక ఉన్న ఆలోచనల్లో కూడా కనిపించేది. సమాజంలో సున్నితమైన అంశాలను ఎంచుకుని వాటిని వినోదాత్మకంగా చెప్పే ప్రయత్నం చేసేవారు. కుటుంబ వ్యవస్థ, మహిళల స్థానం, దాంపత్య బంధాలు, మానవ సంబంధాల్లోని సంఘర్షణలను ఆయన తెరపై కొత్త కోణంలో ఆవిష్కరించారు. అప్పట్లో ఆయన చిత్రాల్లోని కొన్ని సన్నివేశాలు, సంభాషణలు తీవ్ర చర్చకు దారితీసినా.. అదే సమయంలో ప్రేక్షకులను ఆలోచింపజేసే శక్తి కూడా వాటికి ఉండేది.

దర్శకుడిగానే కాకుండా నటుడిగా కూడా భాగ్యరాజ్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. సహజమైన నటన, టైమింగ్‌తో కూడిన కామెడీ, భావోద్వేగ సన్నివేశాల్లోని లోతైన అభినయం ఆయనను ప్రేక్షకులకు మరింత చేరువ చేశాయి. తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకులకూ ఆయన సుపరిచితమే. ఆయన నటించిన, దర్శకత్వం వహించిన అనేక చిత్రాలు తెలుగులో డబ్ కావడమే కాకుండా, కొన్ని సినిమాలు రీమేక్ అయ్యి ఘన విజయాలు సాధించాయి. తెలుగులో రీమేక్ అయి సూపర్ హిట్‌గా నిలిచిన సుందరకాండ, అబ్బాయిగారు, ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, రాధా కళ్యాణం, మాయదారి మొగుడు, ఇల్లాలే నా దేవత లాంటి సినిమాలన్నింటికి ఆయనే కథను అందించాడు. కొన్నింటికి దర్శకత్వం కూడా వహించాడు.

కె. భాగ్యరాజ్ కథల్లో విలన్లు ఉండరు. కేవలం పాత్రల మధ్య వచ్చే అపార్థాలు, మానవ సంబంధాలు, మిడిల్ క్లాస్ సెంటిమెంట్ మరియు సున్నితమైన హాస్యం మాత్రమే కథను నడిపిస్తాయి. అందుకే ఆయన కథలు తెలుగు నేటివిటీకి అంత బాగా సెట్ అయ్యి రీమేక్స్‌లో తిరుగులేని విజయాలను అందించాయి

### కింగ్ ఆఫ్ స్క్రీన్‌ప్లే..

స్క్రీన్‌ప్లే రచనలో భాగ్యరాజ్ ఒక ప్రత్యేక పాఠశాల. సాధారణ కథనాన్ని కూడా ఆసక్తికర మలుపులు, చురుకైన సంభాషణలు, సహజమైన పాత్రలతో ప్రేక్షకుడిని చివరి వరకు కట్టిపడేసే నైపుణ్యం ఆయన సొంతం. నేటి తరం దర్శకుల్లో కూడా చాలామంది భాగ్యరాజ్‌ను తమకు స్ఫూర్తిగా పేర్కొంటూ ఉంటారు. సినిమాలతో పాటు రచయితగా, పత్రికా సంపాదకుడిగా కూడా ఆయన సేవలందించారు. తమిళ సినీ పరిశ్రమలో ఆయన ఒక సృజనాత్మక శక్తిగా గుర్తింపు పొందారు.

### భాగ్యరాజ్ నటించిన తెలుగు సినిమాలు

చిలిపి పెళ్లాం (1990)
మీ ఇంటికొస్తే ఏం ఇస్తారు.. మా ఇంటికొస్తే ఏం తెస్తారు (2004)
మేం వయసుకు వచ్చాం (2012)
డిటెక్టివ్ (2017)
అల్లంత దూరాన (2023)
35 చిన్న కథ కాదు (2024)
కుబేర(2025)

ఇటీవలే ఆయన గురువు భారతి రాజా మృతితో విషాదంలో మునిగిన తమిళ సినీ లోకం.. రెండు వారాలు గడవకముందే భాగ్యరాజ్‌ను కూడా కోల్పోవడం పరిశ్రమను మరింత కలచివేసింది.





EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com